ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 30.0
కనిష్ఠం : 24.0

నేడు మాధవ్ రాక

పశ్చిమలో వాయిదా.. ఏలూరు యథాతథం



భీమవరం/ఏలూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పశ్చిమ గోదావరి జిల్లా పర్యటన రద్దు కాగా, ఏలూరు పర్యటన యథాతథంగా కొనసాగనుంది. మంగళవారం జరగాల్సిన భీమవరం పర్యటన అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని, తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని బీజేపీ నాయకులు తెలిపారు. మరోవైపు మంగళవారం రాత్రి ఆయన ఏలూరు చేరుకుంటారు. బుధవారం ఉదయం 7.30 బిర్లాభవన్ సెంటర్‌లో చాయ్ పే చర్చలో పాల్గొంటారు. ప్రభుత్వాస్పత్రి రోడ్డులోని స్వాతంత్ర్య సమరయోధుడు మూర్తిరాజు విగ్రహానికి, పాతబస్టాండ్ సెంటర్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అక్కడి నుంచి జూట్ మిల్లు వరకు బీజేపీ శోభాయాత్రలో నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొంటారు. భోజన విరామం అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు క్రాంతి కల్యాణ మండపంలో పార్టీ జిల్లా విస్తృత సమావేశంలో పాల్గొని దిశా నిర్దేశం చేస్తారు. ఐదు గంటలకు కొత్త బస్టాండ్ సమీపంలోని ఒక హోటల్‌లో బీజేపీ నేత అంబికా కృష్ణ ఆధ్వర్యంలో మేధావుల సమావేశంలో పాల్గొంటారు. రాత్రి వంగాయగూడెంలో పార్టీ సామాన్య కార్యకర్త శేషశయన ఇంట్లో భోజనం చేసి విజయవాడకు తిరిగి వెళతారు.



మాధవ్ పర్యటనపై చర్చిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, ఇతర నాయకులు

లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ ఆరు గంటలు ఆలస్యం

నరసాపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నరసాపురం-లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ సోమవారం రాత్రి ఆరు గంటలు ఆలస్యంగా రాత్రి ఒంటి గంటకు బయలుదేరనున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. నాగర్‌సోల్ నుంచి ఉదయం ఎనిమిది గంటలకు వచ్చే ఈ రైలును ప్రతిరోజు నిర్వహణ పనులు చేపట్టి సాయంత్రం ఏడు గంటలకు లింగంపల్లికి పంపుతారు. సోమవారం నాగర్‌సోల్ నుంచి వచ్చే రైలు రాత్రి ఏడు గంటలకు నరసాపురం రావడంతో నిర్వహణ పనులు చేపట్టిన తర్వాత పంపించారు. ప్రయాణీకులకు ముందుగా సమాచారం పంపడంతో చాలామంది టిక్కెట్లు రద్దు చేసుకున్నారు. మరికొందరు రాత్రి పొద్దుపోయిన తరువాత స్టేషన్‌కు వచ్చారు.

3వ తేదీ నుంచి పుట్లచెరువు-పసలపూడి రైల్వేగేటు మూసివేత

మండవల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో పుట్లచెరువు-పసలపూడి రైల్వేగేటును అత్యవసర మరమ్మతుల నిమిత్తం మూడో తేదీ నుంచి మూసి వేయనున్నట్టు కైకలూరు సీనియర్ సెక్షన్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. గేట్ నెం.66కి 57/32 వద్ద సెప్టెంబరు 3వ తేదీ నుంచి 10వ తేదీ రాత్రి 7గంటల వరకు మూసివేయనున్నట్టు తెలిపారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.



ఉప్పుటేరులో పంటుపై ఎక్స్‌కవేటర్‌తో తూడు తొలగింపు

ఉప్పుటేరు.. ప్రక్షాళన!

దశాబ్దాలుగా ప్రక్షాళనకు నోచుకోని ఉప్పుటేరు ప్రక్షాళనకు నోచుకుంటోంది. ఎన్నో ప్రభుత్వాలు మారినా ఉప్పుటేరు ప్రక్షాళనపై దృష్టి సారించలేదు. ఆక్రమణలను సైతం అడ్డుకోలేక పోయారు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే కామినేని చొరవతో ఉప్పుటేరు ప్రక్షాళనకు నోచుకుంటోంది. కొల్లేరు గ్రామాలకు ముంపు బెడద తొలగించేలా చర్యలు తీసుకుంటున్నారు.

ముంపు నివారణకు చర్యలు

- 35 ఏళ్ల క్రితం డ్రెడ్జింగ్ పనులు
- నేడు ఎమ్మెల్యే కామినేని చొరవ
- తూడు, గుర్రపుడెక్క తొలగింపు

కైకలూరు, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి):వర్షాకాలం వస్తే చాలు ఉప్పుటేరు పొంగి ఎక్కడ ముంపునకు గురవుతామోనని కొల్లేరు లంక గ్రామస్థులు బిక్కుబిక్కుమంటుంటారు. 2024లో కొల్లేరు వరద ముంపుతో రెండు నెలలు పాటు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొల్లేరు, ఉప్పుటేరును ప్రక్షాళన చేస్తామని నాయకులు ఇచ్చిన హామీల మేరకు ఆ దిశగా అడుగులు వేశారు. కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఉప్పుటేరు ప్రక్షాళనతోనే కొల్లేరు ముంపు సమస్యను పరిష్కారమన్న నిర్ధారణకు వచ్చి పశ్చిమ గోదావరి జిల్లా ఉండి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజుతో కలిసి చర్చించి పలు దఫాలుగా ఉప్పుటేరును పరిశీలించారు. కొంత మంది రైతులకు నష్టం జరిగినా ముంపు సమస్య పరిష్కారం కావాలంటే ఆక్రమణలను తొలగించాలని అభిప్రాయపడ్డారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల కలెక్టర్లు వెట్రిసెల్వి, నాగరాణి ఉప్పుటేరును పరిశీలించారు. ఈక్రమంలోనే ఎక్స్‌కవేటర్లతో ఉప్పుటేరు ఆక్రమణలను, కొల్లేరు పెద్దఎడ్లగాడి వంతెన వద్ద దట్టంగా పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనులను ఎమ్మెల్యే కామినేని సొంతనిధులు వెచ్చించి చేపట్టారు. కైకలూరు మండలం కొట్టాడ, ఆలపాడు, సోమేశ్వరం, కలిదిండి మండలం చిన్నతాడినాడ, పెద్దతాడినాడ, సున్నంపూడి తదితర గ్రామాల వెంబడి ఈ పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఉప్పుటేరులో పంటు ఏర్పాటు చేసి దానిపైన ఎక్స్‌కవేటర్లతో కిక్కిస, గుర్రపుడెక్క, తూడును తొలగించడంతో ఎగువ నుంచి వచ్చిన వరద నీరు కొల్లేరు నుంచి ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి చేరుకుంటోంది. దీంతో ఈ ఏడాది ముంపు సమస్య దాదాపుగా కొల్లేరు గ్రామాలకు తప్పినట్లే.

మూడు దశాబ్దాలుగా డ్రెడ్జింగ్ ఊసేలేదు

30 ఏళ్ల క్రితం 1989-94 మధ్యలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఉప్పుటేరులో డ్రెడ్జింగ్ పనులు నిర్వహించారు. ఆ సమయంలో కృష్ణా-గోదారి డెల్టా ఆధునికీకరణ పనుల పేరుతో సుమారు రూ.300 కోట్లు నిధులను కేటాయిస్తే అందులో భాగంగా ఉప్పుటేరులో కొద్దిమేరకు మాత్రమే డ్రెడ్జింగ్ పనులను నిర్వహించారు. అప్పటి నుంచి నేటి వరకు ఎక్కడా ఉప్పుటేరులో డ్రెడ్జింగ్ చేసిన దాఖలాలు లేవు.

గత 50 ఏళ్లుగా ఉప్పుటేరు ప్రక్షాళన ఊసే లేకపోవడంతో 270 మీటర్లు వెడల్పున ఉండాల్సిన ఉప్పుటేరు 70 మీటర్లకు కుచించుకుపోయింది. ఎక్కడ చూసినా కిక్కిసక్ర పెరిగి నీటి ప్రవాహానికి అవరోధాలు ఏర్పడ్డాయి. ఉప్పుటేరు ప్రధాన భాగమైన కొట్టాడ సమీపాన రైల్వే అధికారులు రెండో లైన్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో అవగాహన లోపంతో భారీ పిల్లర్లు వేసి నీటి ప్రవాహానికి అవరోధాన్ని సృష్టించారు. వీటిపైన రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఎమ్మెల్యే కామినేని పరిష్కార దిశగా కృషి చేస్తున్నారు. వాటిలో వదిలివేసిన ఐరన్ రింగులను తీసివేయాలని ప్రతిపాదనలు చేశారు.

కొల్లేరు ప్రక్షాళన...

కొల్లేరు వరద ముంపుతో అనేక గ్రామాలు జల దిగ్బంధానికి గురవుతున్నాయి. వీటిలో ప్రధానంగా మండవల్లి మండలం పెద్దఎడ్లగాడి నుంచి పెనుమాకలంక వెళ్లే రహదారి ముందుగా వరదలో చిక్కుకుంటోంది. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని పెద్ద ఎడ్లగాడి వంతెన వద్ద (మిగతా 8వ పేజీలో)



చిన్నంపేట కాజ్‌వే వద్ద ఉధృతంగా తమ్మిలేరు

తమ్మిలేరుకు పోటెత్తిన వరద

చింతలపూడి/చాట్రాయి/ఏలూరు/ఏలూరు రూరల్/ఏలూరు క్రైం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు చింతలపూడి సమీపంలోని నాగిరెడ్డిగూడెం వద్ద ఉన్న తమ్మిలేరు రిజర్వాయరుకు వరదనీరు పెరిగింది. సోమవారం సాయంత్రం నాటికి రిజర్వాయరులోకి ఇన్‌ఫ్లో 6,400 క్యూసెక్కుల నీరు చేరుతుండగా ప్రాజెక్టు రెగ్యులేటర్ నుంచి అవుట్‌ఫ్లో 7,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 355 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 349.5 అడుగులు ఉందని ప్రాజెక్టు ఏఈ లాజర్‌బాబు తెలిపారు. చింతలపూడి మండలంలో ఎగువ శివపురం కాజ్‌వేకు ఆనుకుని వరద నీరు ప్రవహిస్తోంది. చాట్రాయి ఎస్‌ఐ రామకృష్ణ, ఆర్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏటిగట్టు గ్రామాల్లో పోలీస్, రెవెన్యూ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్, ఎస్పీ

తమ్మిలేరు రిజర్వాయర్ నుంచి దిగువకు నీరు విడుదల చేస్తుండడంతో ఏలూరు నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కె.కిశోర్ సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఏలూరు రూరల్ మండలంలోని కొల్లేరు సరస్సు పరిసర గ్రామాల దిగువ ప్రాంత ప్రజలు, ఏలూరు నగరవాసులు అప్రమత్తంగా ఉండాలని రూరల్ తహసీల్దార్ విజయ్ కుమార్‌రాజు, డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్ వేర్వేరు ప్రకటనల్లో సూచించారు. తెలిపారు. తమ్మిలేరుకు వరదనీరు పోటెత్తుతుండడంతో శనివారపుపేట కాజ్‌వే పైనుంచి వెళ్లేందుకు అవకాశం ఉన్నందున సాయినగర్, తంగెళ్లమూడిలోని అన్న క్యాంటీన్, కొమడవోలు ఇందిరమ్మ కాలనీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు తహసీల్దార్ గాయత్రి తెలిపారు. అన్న క్యాంటీన్ ప్రాంతం లోని 17 కుటుంబాలను మసీదు వీధిలోని పునరావాస కేంద్రానికి తరలించారు.



కోయిదా వద్ద పడవపై రాకపోకలు

నెమ్మదిగా తగ్గుతున్న గోదావరి

కుక్కునూరు/వేలేరుపాడు, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం నెమ్మదిగా తగ్గుతోంది. సోమవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద 44.50 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఇంకా మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. కుక్కునూరు మండలంలో రెండు రోజులుగా గోదావరి నిలకడగా ఉంది. వేలేరుపాడు- కోయిదా ప్రధాన రహదారి నీట మునగడంతో సుమారు 20 గ్రామాల ప్రజలతో పాటు వేలేరు పాడు, రుద్రమ్మకోట-రేపాకగొమ్మువాసులకు పడవ ప్రయాణమే దిక్కయ్యింది.

జిల్లాలో భారీ వర్షాలు

- నేటి నుంచి బంగాళాఖాతంలో అల్పపీడనం

ఏలూరుసిటీ, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి):బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనంతో జిల్లాలో సోమవారం భారీ వర్షాలు కురిశాయి. మంగళవారం నుంచి బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ఏర్పడుతుందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీని ప్రభావంతో రానున్న రెండు మూడు రోజుల పాటు ఉత్తర కోస్తాలో అనేక చోట్ల మోస్తరు వర్షాలు, అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని, తీరం వెంబడి 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. గత 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా జీలుగుమిల్లి మండలంలో 80.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 10.7 మి.మీ నమోదైంది. చింతలపూడి 35, టి.నరసాపురం 33.2, ద్వారకా తిరుమల 28.6, కామవరపుకోట 27.2, లింగపాలెం 20.2, కుక్కునూరు 15.8, జంగారెడ్డిగూడెం 10.4, భీమడోలు 8.4, వేలేరుపాడు 6.6, కొయ్యలగూడెం 6.6, బుట్టాయిగూడెం 6.2, ఉంగుటూరు 6.2, చాట్రాయి 6.2, ఆగిరిపల్లి 4.8 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి. జిల్లాలో వర్షం కురిసిన మిగిలిన మండలాల్లో 2మి.మీ కన్నా తక్కువగానే వర్షపాతం నమోదైంది.



ఏలూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చంటి

92.25 శాతం పింఛన్లు పంపిణీ

ఏలూరుసిటీ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకం కింద సెప్టెంబరులో 2,61,221 మంది పింఛన్‌దారులకు పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 2,40,097 (92.25 శాతం) పింఛన్లు పంపిణీ చేసినట్టు డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు తెలిపారు. జిల్లాలోని 605 సచివాలయాల పరిధిలోని 5,303 మంది సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి పింఛన్ సొమ్ము అందించారు. మిగిలిన లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ చేస్తామన్నారు.

ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడండి : జేసీ



ఏలూరురూరల్, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారులతో అధికారులు స్వయంగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని జేసీ పి.ధాత్రిరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 253 అర్జీలను స్వీకరించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో 45 ఫిర్యాదులు



ఏలూరు క్రైం :అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెస్సేజ్‌లకు స్పందించవద్దని ఎస్పీ కేపీఎస్ కిశోర్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏఎస్పీ సూర్యచంద్రరావుతో కలిసి నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక 45 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

మరో 50 మందికి..!

రెండో విడత డీఎస్సీ అభ్యర్థులకు కాల్‌లెటర్లు జారీ

- నేడు ఏలూరు డీఈవో కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలనకు ఏర్పాట్లు
- మెడికల్ బోర్డు పరిశీలనలో నలుగురు వీహెచ్ అభ్యర్థులకు తిరస్కారం?

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ ఉద్యోగ నియామ కాలకు సెలక్షన్ జోన్ పరిశీలనకు వచ్చిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు రెండో విడత కాల్‌లెటర్ల జారీ, సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌పై విద్యాశాఖ స్పష్టతనిచ్చింది. దీనికి సంబంధించి సోమవారం రాత్రి విద్యా శాఖ ఉన్నతాధికారులు నిర్వహించిన వెబెక్స్ సమావేశం లో ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారని ఉమ్మడి జిల్లా డీఈవో, డీఎస్సీ కన్వీనర్ ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఎంత మంది అభ్యర్థు లకు కాల్‌లెటర్లు జారీ అవుతాయో సమాచారం లేదన్నారు. ఆ మేరకు రెండో విడత కాల్ లెటర్లను సంబంధిత అభ్యర్థుల లాగిన్‌లకు సోమవారం అర్ధ రాత్రి తర్వాత జారీ అవుతాయి. సుమారు 50 మందిలోపు అభ్యర్థులకు కాల్ లెటర్లు అందే అవకా శం ఉంది. కాల్‌లెటర్లు అందుకున్న వారంతా మంగళవారం ఏలూరు డీఈవో కార్యాలయానికి సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలి. ముందుగా వైకల్య అభ్యర్థుల అకడమిక్ ధ్రువపత్రాలను పరిశీలించి, ఆ వెంటనే వైకల్య స్వభావాన్ని, శాతాన్ని నిర్ధారించేందుకు ఏలూరు, గుంటూరు ప్రభుత్వ సర్వ జన ఆసుపత్రుల మెడికల్ బోర్డుల ఎదుట హాజరయ్యేలా పంపాలని ఆదేశించారు. కాగా రెండో విడత కాల్ లెటర్లు అందుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీ లన నిమిత్తం డీఈవో కార్యాలయంలో నాలుగు టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. హాజరయ్యే అభ్యర్థులంతా అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడు సెట్ల అటెస్టెడ్ ఫోటోస్టాట్ కాపీలు, కుల, నివాస ధ్రువీక రణ పత్రాలు, వైకల్య నిర్ధారణ పత్రాలు, ఐదు పాస్‌పోర్టుసైజు ఫోటోలు తెచ్చుకోవాలి.

నలుగురు వైకల్య అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు తిరస్కరణ ?

తొలివిడత సెలక్షన్ జోన్ పరిశీలనకు వచ్చిన అభ్యర్థుల్లో వివిధ వైకల్యాలు వున్న అభ్యర్థులు 35 మంది ఉన్నారు. వీరందరూ వైకల్య శాతాన్ని నిర్ధారించే సదరం సర్టిఫికెట్లను అందజేశారు. డీఎస్సీ మార్గదర్శకాల ప్రకారం సదరం సర్టిఫికెట్‌వున్నా మరోదఫా మెడికల్ బోర్డు నుంచి నిర్ధారణ ధ్రువ పత్రాన్ని పొంది సమర్పించాలి. ఆ మేరకు నిర్ణీత మార్గదర్శకాల ప్రకారం వైకల్య శాతం ఉంటేనే ఉపాధ్యాయ ఉద్యోగాల్లో రిజర్వేషన్ వర్తిస్తుంది. దీనికనుగుణంగానే దృష్టి లోపం (వీహెచ్) అభ్యర్థులు 14 మంది, ఎంఐ అభ్యర్థులు ముగ్గురు, ఆర్థో అభ్యర్థులు 10 మంది, బధిరులు 8 మంది తమ వైకల్యాన్ని నిర్ధారిస్తూ మెడికల్ బోర్డు జారీ చేసే సర్టిఫికెట్‌ను సమర్పించాలి. వీరిలో బధిర అభ్యర్థులను గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మెడికల్ బోర్డుకు, మిగతా వారినందరినీ ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మెడికల్ బోర్డుకు పంపించారు. మెడికల్ బోర్డులో ముగ్గురు వైద్య నిపుణులు సదరం సర్టిఫికెట్లతో సంబంధం లేకుండా మరోదఫా సమగ్రంగా, భౌతికంగా పరిశీలించి సర్టిఫికెట్ ఇవ్వాలి. ఈ క్రమంలో దృష్టి లోపం (వీహెచ్) కేటగిరీలో వున్న నలుగురు అభ్య ర్థులకు నిర్ణీత ప్రమాణాల మేరకు వైకల్యం లేదని మెడికల్ బోర్డు ధ్రువీకరించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో సంబంధిత అభ్యర్థుల స్థానే తదుపరి మెరిట్ అభ్యర్థులకు కాల్ లెటర్లు జారీ కానున్నట్టు సమాచారం.

మరోవైపు ఫిజికల్లీ హ్యాండీ కాప్డ్ (పీహెచ్) కేట గిరీలో గతంలో సదరం సర్టిఫికెట్లు పొంది సామా జిక పింఛన్లు పొందుతున్న వారి ధ్రువపత్రాలను ఇటీవల రీవెరిఫికేషన్‌కు (మిగతా 8వ పేజీలో)



కుక్కునూరు మండలం ఉప్పేరు ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

90 మంది విద్యార్థులు.. ఒక్కరే ఉపాధ్యాయుడు

కుక్కునూరు, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి):ముంపు మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చదువులు చెప్పే ఉపాధ్యాయులు కరువయ్యారు. ఈ ఏడాది వేసవిలో రెగ్యులర్ ఉపాధ్యాయులతోపాటు మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులు కలిపి 100 మందికి పైగా రెండు మండలాల నుంచి బదిలీ అయ్యారు. మూడు నెలలుగా ఉపాధ్యాయులు లేక పిల్లలకు చదువు పూర్తిస్థాయిలో చెప్పే పరిస్థితి లేదు. పలు పాఠశాలల్లో 60 నుంచి 90 మంది విద్యార్థులు వుండగా కేవలం ఒక ఉపాధ్యాయుడే ఒకటి నుంచి ఏడో తరగతి వరకు పాఠాలుచెప్పే పరిస్థితి. అధికారులు మాత్రం కొత్త డీఎస్సీ ద్వారా పోస్టు లను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. కుక్కునూరు మండలంలో 46 మండల పరిషత్ ప్రాథమిక పాఠ శాలలు ఉన్నాయి. 100 మంది ఎస్జీటీ ఉపాధ్యాయుల అవసరం ఉండగా 25 మంది మాత్రమే పని చేస్తు న్నారు. ఇంకా 75 ఎస్జీటీ పోస్టులు ఖాళీ. యూపీఎస్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లు కావాలి. మండలంలో మూడు జడ్పీ హైస్కూల్స్‌లో 25 పోస్టులు ఖాళీ ఉన్నాయి. వేలేరుపాడు మండలంలో 42 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు ఉండగా 35 ఉపాధ్యాయ పోస్టులు, జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవన్నీ భర్తీ అయితే ఈ మండలాల్లో చదువులు సజావుగా సాగే అవకాశం ఉంది.



లడ్డూ ప్రసాదం దక్కించుకున్న కృష్ణను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ



ఆచంట వేమవరంలో లడ్డు దక్కించుకున్న నాగరాజు

లడ్డూ ప్రసాదం..లక్షల్లో వేలం

ఆచంట/ కాళ్ళ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా లడ్డు ప్రసాదం వేలం నిర్వహిస్తున్నారు. భక్తులు భారీ మొత్తం చెల్లించి లడ్డు దక్కించుకుంటున్నారు.ఆచంట వేమవరంలో గ్రామానికి చెందిన వేమవరపు నాగరాజు 2 లక్షల 13 వేల రూపాయలకు లడ్డు దక్కించుకున్నాడు. కాళ్ళ మండలం పెద అమిరంలోని ఉప సభాపతి రఘురామకృష్ణరాజు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఐదు కేజీల లడ్డూను రూ. 1.50 లక్షలకు వాండ్రం గ్రామ సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ దక్కించుకున్నారు. ఈ సొమ్ము 'ఉండి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిధి'కి జమ చేస్తున్నట్లు రఘురామకృష్ణరాజు తెలిపారు.



నిత్యార్జిత కల్యాణంలో కుటుంబ సభ్యులతో రవికుమార్

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే కూన రవికుమార్

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని పబ్లిక్ అండర్ టేకింగ్ ఛైర్మన్, ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సందర్శించారు. ఆలయానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు,అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు వేదాశీర్వచనం పలికారు. ఆలయ ఈవో సత్య న్నారాయణ మూర్తి ఆయనకు స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అనంతరం కుటుంబంతో సహా శ్రీవారి నిత్యార్జిత కల్యాణంలో పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయండి ..

ప్రముఖ ఆలయాల్లో 20 ఏళ్ల పైబడి ఎన్ఎంఆర్‌లు, కాంట్రాక్ట్ బేసిక్ ఉద్యోగులుగా పనిచేసి ప్రస్తుతం మినిమం టైం స్కేలు పేఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయించాలని కోరుతూ ద్వారకా తిరుమల దేవస్థానంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం అక్టోబరు 21, 2023న జారీ చేసిన జీవో 114 ద్వారా రెగ్యులర్ చేయించాలని కోరారు.



నిత్యాన్నదాన పథకానికి రూ2 లక్షలు విరాళం ఇచ్చిన రేపాక కృష్ణకుమారికి బాండ్ ఇస్తున్న ఈవో శ్రీనివాసరావు, అర్చకులు

నిత్యాన్నదాన పథకానికి రూ. 2 లక్షలు విరాళం

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నధాన పథకం అమలుకు రేపాక రామలింగయ్య, అన్నపూర్ణ దంపతుల జ్ఞాపకార్థం కుమార్తె కృష్ణకుమారి రూ.2 లక్షలు విరాళం అందజేశారు. విరాళం బాండును ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, అర్చకులు అందజేశారు. సోమవారం సందర్భంగా స్వామివారికి ఏకవార రుద్రా భిషేకాలు నిర్వహించారు.ఆలయ ప్రధానార్చకులు సన్నిధిరాజు రామకృష్ణమూర్తి (కిష్టప్ప) స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు.

ఆపదలో ఆదుకోని బంధాలు

కష్టపడిన సొమ్ము తండ్రి, తమ్ముడి ఖాతాల్లో జమ

వైద్య ఖర్చుల కోసం వస్తే ఇంటి తలుపులు మూసేసిన వైనం

12 గంటలుగా వీల్‌చైర్‌పై ఇంటి ఎదుటే నిరీక్షణ



తణుకు రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అని మానసిక శాస్త్రవేత్తలు చెప్పినట్లుగా రోజు రోజుకు మనుషుల మధ్య ప్రేమ, ఆప్యాయతలు తగ్గిపోతున్నాయి. సోమవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో జరిగిన సంఘటన దీనికి బలం చేకూరుస్తున్నది. వివరాల్లోకి వెళితే వేల్పూరు గ్రామానికి చెందిన తాడిశెట్టి నాగ త్రినాథ్ ఇంటర్ వరకూ చదువుకుని ఉపాధి నిమిత్తం 2018లో సింగపూర్ వెళ్లాడు. ఇతనికి తండ్రి నాగేశ్వరరావు, అన్న నాగ శ్రీను, తమ్ముడు నాగ రాజ కిరణ్‌లు వున్నారు. నాగ త్రినాథ్ సింగపూర్‌లోని ఒక కంపెనీలో ఫైర్ అండ్ సేఫ్టీ విభాగంలో పని చేస్తూ నెలకు రూ. 75 వేల నుంచి 80 వేల వరకూ సంపాదించేవాడు. వచ్చిన జీతంలో రూ.20 వేలు వుంచుకుని మిగిలిన సొమ్మును తండ్రి, తమ్ముడు బ్యాంక్ ఖాతాలలో జమ చేసేవాడు. 2024 జూలైలో స్వగ్రామం వేల్పూరు వచ్చేశాడు. అదే కంపెనీ నుంచి ఉద్యోగం ఆఫర్ రావడంతో మెడికల్స్ అన్ని పూర్తి చేసుకున్నాడు. బైక్ నుంచి జారిపడటంతో నడుం బాభాగానికి గాయమైంది. అప్పటి నుంచి వీల్ ఛైర్‌కే పరిమితమైన త్రినాథ్ ఫిజియోథెరపీ కోసం విశాఖపట్టణంలో వైద్యం పొందుతున్నాడు. రూ. 4 లక్షల వరకూ ఖర్చు కాగా ఇంకా రూ. 2 లక్షలు ఆసుపత్రి వారికి బకాయి ఉండడంతో తన తండ్రి అడిగి తీసుకు నేందుకు సోమవారం ఉదయం విశాఖపట్టణం నుంచి వేల్పూరు వచ్చాడు. అతడిని ఇంట్లోకి రానివ్వకుండా తండ్రి నాగేశ్వరరావు, అన్న, తమ్ముడు అడ్డుకో వడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఇంటి ఎదుట రోడ్డుపైనే వీల్‌చైర్‌లో ఉండిపోయాడు.సింగ్‌పూరల్‌లో సంపాదించిన సొమ్ము అంతా తండ్రి తమ్ముడు నాగ బ్యాంక్ ఖాతాలకే జమ చేశానని ఇప్పుడు అనారోగ్యంతో వుండి వైద్య ఖర్చులకు కూడా డబ్బులు ఇవ్వడం లేదని కదలలేని స్థితిలో ఉన్న తనకు న్యాయం చేయాలని త్రినాథ్ కోరుతున్నాడు.

కొవ్వలి స్కూల్ పరిశీలించిన గుజరాత్ అధికారుల బృందం



దెందులూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఎంశ్రీ పాఠశాలగా ఎంపికైన నేపథ్యంలో గుజరాత్ రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ (ఐఏఎస్) కె.రంజిత్ కుమార్, అధికారుల బృందం సోమవారం కొవ్వలి హైస్కూల్‌ను పరిశీలించారు. ఏపీ రాష్ట్ర అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి రవీంద్ర నాథ్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి పంకజ్ కుమార్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సైన్సు ల్యాబ్, క్రీడామైదానం, రన్నింగ్ ట్రాక్, తరగతి గదులు పరిశీలించారు. సమగ్ర శిక్ష ఎంవో రామారావు, దెందులూరు ఎంఈవో ప్రసాద్, అన్నమ్మ, హెచ్ఎం శర్మ, విద్యాకమిటీ ఛైర్మన్ గణేష్ కుమార్ ఉన్నారు.



విభిన్న గణనాథా ! నమోస్తుతే

పెంటపాడు గౌరీదేవి ఆలయం వద్ద నందీశ్వరుడిపై ఆసీనుడైన గణనాథుడు అందరినీ ఆకర్షిస్తున్నాడు



ఏలూరు పెద్ద అమ్మవారిగుడి పక్కన 18 అడుగుల లక్ష్మీగణపతి విగ్రహం ఏర్పాటు చేశారు.21 ఏళ్లుగా ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వినాయకుని చేయి ముందుకు వెనుక్కు కదులుతూ దీవిస్తున్నట్టు ఏర్పాటు చేశారు.



ఏలూరు మార్కండేయ ఆలయ సమీపంలో పంచముఖి అంజనేయ స్వామి అవతారంలో వినాయకుడు

వేడుక.. కారాదు.. విషాదం

వినాయక నిమజ్జనాల్లో అత్యుత్సాహం

ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వైనం

ఈ ఏడాది పదిమంది వరకు మృత్యువాత

డీజే సౌండ్‌లు.. మత్తులో డ్యాన్స్‌లు

కొరవడిన భక్తిభావం



ఆచంటలో ట్రాక్టర్‌పై గణనాథుని ఊరేగింపు

భీమవరం క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పండగైనా.. ఫంక్షనైనా అందులో చాలామంది ఆనందాన్ని వెతుకుతుంటారు. వేడుకల్లో డీజే శబ్దాలతో డ్యాన్స్‌లు వేస్తుంటారు. చవితి ఉత్సవాలు జరుగుతున్నాయి. విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఊరేగింపుగా వెళుతుంటారు. భారీ సౌండ్ సిస్టమ్‌లతో పాటుగా కొందరు మద్యం సేవించి నృత్యాలు చేస్తున్నారు. అనంతరం విగ్రహాలను నదుల్లో, కాలువల్లో నిమజ్జనం చేస్తాంటారు. అయితే అత్యుత్సాహంతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇటీవల ఒకరు డీజే సౌండ్‌కు గుండెపోటు వచ్చి మృత్యువాతపడితే మరొకరు కాలువలో విగ్రహాన్ని నిమజ్జనం చేసిన తర్వాత ఈత రాక చనిపోయాడు. మొన్న నరసాపురం మండలంలో జరిగిన సంఘటనలో నలుగురు చనిపోయారు. ఊరేగింపులో ట్రాక్టర్ అదుపు తప్పి దూసుకువెళ్ళడంతో బాలుడితో సహా నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ట్రాక్టర్ నడిపే వ్యక్తి అజాగ్రత్తగా వ్యవహరించడం వల్లే నలుగురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఒక పక్క పోలీసు శాఖ, మరోపక్క రెవెన్యూ, అగ్నిమాపక శాఖ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నప్పటికీ మార్పు కనబడటం లేదు.

ఊరేగింపుల్లో పాత గొడవలు

విగ్రహాలు నిలబెట్టినప్పటి నుంచి వాటిని నిమజ్జనం చేసే వరకు పోలీసులు నిబంధనలు విధించారు. పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. అయినా కూడా చాలామంది యువత అవేమీ పట్టించుకోవడం లేదు. డీజే వద్దని చెప్పి నప్పటికీ కొంతమంది భారీస్థాయిలో డీజేలు ఏర్పాటు చేసి నిమజ్జనాలకు వెళ్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో వినాయక నిమజ్జనాలకు సంబంధించి పది మంది వరకు మృత్యువాత పడ్డారు. వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించడం కోసం కొందరు తగాదాలు పడి గాయాలపాలవుతున్నారు. ఎప్పటి నుంచో ఉన్న గొడవలను ఈ సమయంలో బయటకు తీసుకువచ్చి తగాదా పడుతున్నారు. రెండు రోజుల క్రితం వీరవాసరం మండలంలో వినాయక చవితి సందర్భంగా ఫ్లెక్సీ వివాదం పెద్ద రచ్చకెక్కింది. రెండు వర్గాల వారు తగాదా పడి కేసుల వరకు వెళ్లారు.

• నిబంధనలు పాటించకపోతే చర్యలు



పోలీసు శాఖ విధించిన నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం. కానీ కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. డీజేలకు అనుమతి లేదని ముందు నుంచీ చెబుతున్నా కొందరు పోలీసు శాఖ నిబంధనలు ధిక్కరిస్తున్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం. నిమజ్జనం చేసేటప్పుడు కాలువల్లో, నదుల్లో లోపలికి వెళ్లొద్దని ప్రత్యేకించి ప్రతి స్పాట్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసినప్పటికీ కొందరు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు.

జయసూర్య, భీమవరం డీఎస్పీ



డీజే.. గుండెలదిరే..!

ఊరేగింపుల్లో హోరెత్తిస్తున్న డీజే పాటలు

భారీ సౌండ్‌తో వృద్ధులు, హృద్రోగులకు ప్రాణసంకటం

సౌండ్ 70 డెసిబెల్ దాటితే వినికిడి శక్తి కోల్పోయే ప్రమాదం

లింగపాలెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : : 'డీజే'.. పెళ్లి ఊరేగింపులు జరగాలన్నా, రాజకీయ నాయకులకు స్వాగతం పలకాలన్నా, దేవుళ్లను ఊరేగించాలన్నా తప్పనిసరిగా ఇది ఉండాల్సిందే. మితిమీరిన శబ్ద కాలుష్యాన్ని సృష్టించే డీజేలకు ప్రాధాన్యం ఎక్కువైంది.వీటి నుంచి వచ్చే అధిక శబ్దాలకు చిన్నారులు, వృద్ధులు గుండె సంబంధిత వ్యాధులున్న వారు భయంతో బిక్క చచ్చిపోతున్నారు. ప్రస్తుతం వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా వీటి వినియోగం ఎక్కువైంది. డీజేల నుంచి వచ్చే విపరీత శబ్దాల వల్ల చెవిలో కర్ణభేరి ప్రభావితమై భవిష్యత్‌లో వినికిడి శక్తి కోల్పోయే ప్రమాదముందని వైద్యులు చెపుతున్నారు. అంతే కాకుండా గుండె సంబంధిత వ్యాధులున్నవారు చనిపోయే ప్రమాదం కూడా లేకపోలేదు. ఇటీవల కాలంలో డీజే శబ్దాలకు డ్యాన్స్ చేస్తూ మృతి చెందిన ఘటనలు అనేకం ఉన్నాయి. మనిషి చెవిలోని కర్ణభేరి సాధారణంగా 25 డెసిబెల్స్ శబ్దాలను మాత్రమే తట్టుకుంటుంది. 70 నుంచి 80 డెసిబెల్స్ వరకు శబ్దాలను వింటే వినికిడి శక్తి కోల్పోతారని ఈఎన్‌టీ వైద్యులు చెపుతున్నారు. ఇక ఉత్సవాలలో ఊరేగింపుల్లో ఎంత శబ్దం వస్తుందో వాటివల్ల మనుషులకు ఎలాంటి నష్టం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ 2015లో శబ్ద కాలుష్యంపై రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం రాత్రి పది గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు భారీ శబ్దాలతో ఊరేగింపులు చెయ్యకూడదనే ఆదేశాలు ఉన్నా ఎక్కడ వాటి అమలు జరగడం లేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం నివాస ప్రాంతాలలో 50 డెసిబెల్స్ వరకు శబ్దం ఉండవచ్చని అది దాటితే మానవుల ఆరోగ్యానికి ప్రమాదమని చెపుతున్నా అధికారుల అలసత్వంతో ఉత్సవాలు, ఊరేగింపులలో 100 నుంచి 150 డెసిబెల్స్ వరకు డీజే శబ్దాలు వినిపిస్తున్నాయి. అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో చూసీ చూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు శబ్ద కాలుష్యాన్ని నివారించాలని కోరుతున్నారు.

తప్పిన పెనుముప్పు

గణేశ్ ఊరేగింపు ట్రాక్టర్ ప్రమాదంపై విచారణ

గేరులో ఉన్న ట్రాక్టర్ తాళం తిప్పడమే కారణం

నరసాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం తూర్పుతాళ్ల వద్ద గణేశ్ నిమజ్జనం ఊరేగింపులో ట్రాక్టర్ ప్రమాదంపై పోలీసులు లోతైన విచారణ చేపట్టారు. ప్రాథమిక విచారణలో డ్రైవింగ్ అనుభవం లేని వ్యక్తి గేర్‌లో ఉన్న ట్రాక్టర్ తాళం తిప్పి సార్ట్ చేయడం కారణమని నిర్ధారించారు. సోమవారం డ్రైవర్‌ను, తాళం తిప్పి ప్రమాదానికి కారణమైన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వినాయక ఉరేగింపులో పెనుముప్పే తప్పిందని గ్రామస్థులు చెబుతున్నారు. ఈమనవారిమెరకలో విగ్రహ ఊరేగింపు ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగుతూనే ఉంది. డ్రైవర్ టాయిలెట్‌కు వెళ్లేందుకు ట్రాక్టర్ ఆపినా గేర్‌లో ఉంచి తాళం తీయలేదు. ఊరేగింపులో మరో వ్యక్తి ట్రాక్టర్ ఎక్కి తాళం తిప్పడంతో ఊరేగింపులో డ్యాన్స్ చేస్తున్న వారిపై దూసుకుపోయింది. ఓ పక్కకు ఒరిగి ఆగిపోవడం పెనుప్రమాదం తప్పింది. వినాయకుడ్ని దర్శించుకునేందుకు రోడ్డుపై ఉన్న మహిళలు పరుగులు తీశారు. అప్పటికే ఐదుగురిపై నుంచి దూసుకుపోవడంతో నలుగురు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. పాలకొల్లులో ప్రైవేట్ అస్పత్రిలో చికిత్స పొందుతున్న కంచర్ల ప్రసాద్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. సంఘటనతో తూర్పుతాళ్ల గ్రామంలో విషాదం అలుముకుంది. మృతులంతా ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో ఈమనవారి మెరకలో ఎక్కడ చూసినా రోదనలే వినిపిస్తున్నాయి. ప్రమాదంలో మృతులు ముగ్గురు రోజువారి కూలీలు, ఒకరు పెయింటర్. పెద్ద దిక్కు పోవడంతో తమ పరిస్థితి ఏమిటంటూ పిల్లలతో మహిళల రోదనతో పలువురు కంటతడి పెట్టారు.



ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్

మృతదేహాలకు పోస్ట్‌మార్టం

మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధి తూర్పుతాళ్ళ గ్రామంలో వినాయక నిమజ్జన ఊరేగింపులో మృతి చెందిన యివన సూర్యనారాయణ (58) తిరుమల నర్సింహమూర్తి (35), గురుజు మురళీ (38), కడియం దినేష్ (9) నలుగురు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ జి.వాసు తెలిపారు.

ఇద్దరు డ్రైవర్‌లపై కేసు నమోదు

ఊరేగింపులో ట్రాక్టర్ దూసుకుపోయిన సంఘటనలో నలుగురు వ్యక్తులు మృత్యువుకు కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌లపై కేసు నమోదు చేసినట్టు మొగల్తూరు ఎస్ఐ జి.వాసు తెలిపారు. ఊరేగింపులో ట్రాక్టర్ నడుపుతూ ప్రమాదానికి కారకులైన డ్రైవర్లు కంచర్ల నరేష్, ఈవన దుర్గా ప్రసాద్‌లపై మృతుడు కడియం దినేష్ తండ్రి వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్ కిషోర్

నిమజ్జనాల్లో జాగ్రత్తగా ఉండాలి

తూర్పుతాళ్ళు సంఘటనతో అధికారుల అలర్ట్

మొగల్తూరు. సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జన కార్యక్రమంలో ఆదివారం రాత్రి నరసాపురం మండలం తూర్పుతాళ్ళ గ్రామంలో నలుగురు మృతి చెందిన సంఘటనతో అధికారులను అప్రమత్తం చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో తహసీల్ధార్ రాజ్ కిషోర్ సమావేశం నిర్వహించారు. ఊరేగింపు,నిమజ్జన సమయాల్లో ఎటువంటి అవశ్రుతులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిమజ్జనాలు సాయంత్రం 6 గంటల్లోపే పూర్తి చేయాలన్నారు. అధికారులు గుర్తించిన ప్రాంతాల్లోనే నిమజ్జనాలు చేయాలని, డీజే సౌండ్‌లు, అశ్లీల నృత్యాలు లేకుండా శాంతియుతంగా ఊరేగింపులు నిర్వహించాలని అన్ని శాఖల అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రమాదకరమైన కాలువలు, గుంటలు, చెరువులు వద్ద నిమజ్జనం చేయడానికి అనుమతించమన్నారు. సమావేశంలో ఎంపీడీవో త్రిశూలపాణి, పోలీస్ సిబ్బంది నర్సింహరావు, ఎంఈవో సాయిరాం, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మోహనరావు, ఇరిగేషన్ ఏఈ వివేక్, పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇక సెలవు !

దశాబ్దాలుగా క్రీడాకారులకు నిలయంగా ఏలూరు ఇండోర్ స్టేడియం

మూడేళ్ల కిత్రం కూలిన పైకప్పు..నేడు పూర్తిగా తొలగింపు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 1, (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ఇండోర్ స్టేడియం గత వైభవాన్ని నిలువటద్దంగా మారింది. నేడు ఎందుకూ పనికి రాకుండా పోయింది. ఫలితంగా సాధన చేసే క్రీడాకారుల సంఖ్య క్రమేపీ తగ్గిపోతోంది. ఏలూరు ఇండోర్ స్టేడియం భవనం పైకప్పు మూడేళ్ల క్రితం కూలిపోయింది. భవనం పైకప్పుతో పాటు ఎలివేషన్ ఎక్కసారిగా కూలిపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. 1978లో స్టేడియంలో భవన నిర్మాణం చేశారు. అప్పటి జిల్లా కలెక్టర్ కుమార స్వామి రెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి స్టేడియంలో జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు జరుగుతూనే ఉన్నాయి. కొన్నేళ్ల క్రితం సిమెంట్ రేకులతో స్టేడియం పైకప్పు వేసి లోపల భాగంలో ఎలివేషన్ చేశారు. లక్షలాది రూపాయల వ్యయంతో ఉడెన్ షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటు చేశారు. ఉదయం సాయంత్రం ఇండోర్‌లో అనేక మంది షటిల్ ఆడేవారు. స్టేడియంలో ఇండోర్ కూలిపోవడంతో క్రీడాకారులు సాధన చేసే జిమ్ సైతం మూతపడింది. ఈ జిమ్‌లో ఏర్పాటు చేసిన తాగునీటి సరఫరా ప్లాంట్ సైతం నిరుపయోగంగా మారింది. దీంతో క్రీడాకారులు జిమ్ కోసం స్టేడియం వదిలి, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. మూడేళ్ల తరువాత కూలిపోయిన స్టేడియాన్ని తొలిగించే పనులు ప్రారంభించారు. కూలిపోయిన సమయంలో ఉన్నతాధికారులు దానిని అభివృద్ధి చేయాలని సుమారు కోటి రూపాయిలతో అంచనాలు రూపొందించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారుల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగలేదు. ఫలితంగా చేయడానికి క్రీడాకారులు దూరం అయ్యారు. కూల్చివేత పనులు ప్రారంభం కావడంతో ఏలూరులో ఇక ఇండోర్ స్టేడియం కనుమరుగు అయినట్లేనని క్రీడాకారులు అంటున్నారు. వైసీపీ ఐదేళ్ల క్రీడా మైదానాలను ఎక్కడికక్కడ భ్రష్టు పట్టించింది.ఏలూరు జిల్లాల్లో క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రీడా మైదానాలు కనీస సౌకర్యాలు లేక కునారిల్లుతున్నాయి. కొత్త మైదానాలు ఏర్పాటు చేయకపోగా ఉన్నవాటి నిర్వహణకు పూర్తిగా నీళ్లొదిలేశారు.ఇండోర్ స్టేడియం, పరికరాలు పూర్తిగా పాడయ్యాయి.వైసీపీ హయాంలో క్రీడాభివృద్ధిని గాలికి వదిలేశారని కూటమి ప్రభుత్వమైనా వాటిని చక్కదిద్దాలని క్రీడాకారులు కోరుతున్నారు.



జిమ్ పరికరాలను తొలగిస్తున్న సిబ్బంది




సెమినార్‌లో మాట్లాడుతున్న బీవీ.రాఘవులు, హాజరైన ప్రముఖులు

సోషలిజమే ప్రత్యామ్నాయం

పెట్టుబడిదారి విధానంతో సంక్షోభం : బీవీ రాఘవులు

భీమవరం టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అనేక దేశాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ విఫలమైందని, దేశానికి సోషలిజమే ప్రత్యామ్నాయమని సీపీఎం అగ్రనేత, పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. స్థానిక త్యాగరాజు భవనంలో సోషలిజం, విశిష్టత అంశంపై జిల్లా స్థాయి సెమినార్ సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాఘవులు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ విధానం ఉన్న సామ్రాజ్యవాద దేశాలు సంక్షోభంలో ఉన్నాయన్నారు. అదే సమయంలో సోషలిజానికి అనేక దేశాల్లో ఆదరణ పెరుగుతుందన్నారు. తిండి, ఇల్లు, విద్య, వైద్యం హక్కుగా మార్చి, సమాన వేతనం ఆలంబనగా అసమానత, కుల వ్యవస్థను రూపుమాపి సమానత్వాన్ని చూపించేదే సోషలిజం అన్నారు. కనీస అవసరాలు హక్కుగా ఉన్న సోషలిస్టు దేశాలు అభివృద్ధి దశలో ఉన్నాయని గుర్తుచేశారు. భారత రాజ్యాంగంలో సోషలిజం, లౌకికవాదం పదాలు తొలగించాలని ఆరెస్సెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారని, వారికి సోషలిజం, లౌకికవాద పదాలు అంటే ఎందుకు భయమని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్‌మీటర్ల పేరుతో ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల ప్రభావం పశ్చిమ గోదావరి జిల్లాపై ఎక్కువగా ఉందన్నారు. విద్యారంగంలో అశాస్త్రీయత పెంచేలా బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. చైనాలో సైన్స్‌తో అద్భుతాలు చేస్తున్నారని, మన దేశంలో ప్రజా ప్రతినిధులే మూఢ నమ్మకాలను చూపిస్తున్నారన్నారు. ప్రజా సమస్యలపై ఉద్యమ, పోరాటాలు మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సాంస్కృతికంగా మంచి సమాజాన్ని నిర్మించే లా సిపిఎం కృషి చేస్తుందన్నారు. అందుకు ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, మంతెన సీతారాం, చింతకాయల బాబురావు, బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, పీవీ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల హాస్టల్స్‌లో కర్నూలు ఉల్లి వినియోగించాలి

తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): కర్నూలు ఉల్లి కిలో రూ.12 ధరకు కొనుగోలు చేయాలని కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి వ్యాపారులకు సూచించారు. స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ హాల్లో సోమవారం ఉల్లి వ్యాపారులతో వారు సమీక్షించారు. అనంతరం మునిసిపల్ కార్యాలయంలో అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల్లో ఉన్న కళాశాలలు, యూనివర్సిటీలు, నిట్, స్కూల్ హాస్టల్స్ ప్రభుత్వ హాస్టల్స్‌లో కర్నూలు ఉల్లి వినియోగించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కార్పొరేట్ మాల్స్‌లో కూడా విక్రయించే చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఆర్డీవో ఖతీబ్‌కౌసర్‌భానో, మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, హాస్టల్ అధికారులు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

భీమవరం టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, కార్యకర్తలు ప్రధాని మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని మహిళా మోర్చా నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం ప్రకాశం చౌక్ దగ్గర మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పద్మా వర్మ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఎస్పీ ఆఫీసులో ఏఎస్పీ వి.భీమారావుకు వినతి పత్రాన్నిఅందించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, రాజ్యసభ సభ్యుడు పాక వెంకట సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ఆదిలక్ష్మి, రాష్ట్ర అధికార ప్రతినిధి రేణుక, జిల్లా ప్రధాన కార్యదర్శి కలిదిండి వినోద్ వర్మ, ఇంజేటి వెంకటేశ్వర్లు, కూర రామ్మూర్తి, ఎర్ర పద్మారావు, రావూరి సుధా, కోమటి రవి సాయి దుర్గరాజు ఆడబాల శివ, ముదునూరి నాగమణి బుంగ బుచ్చమ్మ, గంట లక్ష్మీ, వెంకటలక్ష్మి, కుక్కల లక్ష్మి ధనలక్ష్మీ, భారతి ఇందిర, మొయిద్దీన్ రాజు తదితర జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కార్యకర్తలు

'సహకార రంగానికి పూర్వ వైభవం తెస్తాం'

ఆకివీడు సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో గాడితప్పిన సహకార వ్యవస్థకు కూటమి ప్రభుత్వంలో పూర్వ వైభవం తీసుకొస్తామని ఆకివీడు సొసైటీ చైర్మన్ ముత్యాల రత్నం అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆకివీడు సొసైటీకి రావాల్సిన బకాయిలు రూ.6 కోట్లు పైసా వసూలు చేస్తామన్నారు. సొసైటీ ద్వారా రైతులకు సేవలందిస్తూ ఆదాయం వచ్చేలా చూస్తామన్నారు. సొసైటీ ద్వారా రూ.27 కోట్లు పైబడి వ్యాపారం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మర్రివాడ వెంకట్రావు, ఊడిగ శ్రీను, ఈవో తోట బాబి ఉన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న రత్నం

ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అంగర

అంగర అభిమానుల అసంతృప్తి

పాలకొల్లు టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌ను ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఆయనకు సరైన పదవి రాలేదని అంగర అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండుసార్లు ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్‌గా ఉన్న తమ నాయకుడిని కార్పొరేషన్ డైరెక్టర్ పదవి కట్టబెట్టడం తగదని అంటున్నారు. ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన నాటి నుంచి నిబద్ధతతో పనిచేసిన అంగరకు చిన్నస్థాయి పదవి ఏమాత్రం సరికాదని అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామ్మోహన్‌కు కార్పొరేషన్ చైర్మన్ స్థాయి పదవిని అభిమానులు ఆశించారు. డైరెక్టర్ పదవి ఇవ్వడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పదవిపై అంగర రామ్మోహన్ కూడా తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలియవస్తుంది. డైరెక్టర్ పదవిని నిరాకరించనున్నట్లు ఉన్నట్లు సమాచారం.



ఆశా వర్కర్‌కు బెదిరింపులు

ఆకివీడు మునిసిపల్ చైర్‌పర్సన్‌పై పోలీసులకు ఫిర్యాదు

ఆకివీడు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆకివీడు పట్టణంలోని 16వ వార్డులో అర్హులకు ఆశా వర్కర్ రామలక్ష్మి పింఛన్లు పంపిణీ చేస్తుండగా తమకు చెప్పకుండా ఎలా పంపిణీ చేస్తావని మునిసిపల్ చైర్‌పర్సన్ జామి హైమావతి, కౌన్సిలర్ పడాల శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అందరినీ తొలగిస్తామని బెదిరించారు. ఆశా వర్కర్ మునిసిపల్ కమిషనర్ కృష్ణమోహన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సూచనతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్‌ఐ బండి సత్యనారాయణ శ్రీనివాసరెడ్డిపై కేసు నమోదు చేశారు.

యూరియా మాయం నిజమే!

విచారణ చేపట్టిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెనుమంట్ర, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ ఎరువుల స్టాక్ పాయింట్లో 25 టన్నుల యూరియా మాయం నిజమేనని వ్యవసాయ శాఖ విచారణ అధికారులు వెల్లడించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు విచారణకు ఆదేశించారు. ఇరగవరం మండల వ్యవసాయ శాఖ అధికారి, క్వాలిటీ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ వై. రాఘవేంద్రరావు సోమవారం ఉదయం పెనుమంట్రలోని సహకార పరపతి సంఘం పక్కనున్న డీసీఎంఎస్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేశా రు. ఈ పోస్ లేకుండా 25 టన్నుల యూరియా గోదాము నుంచి మాయమైనట్టు నిర్ధారించారు. ఆగస్టు 23వ తేదీన డీసీఎంఎస్ సేల్స్‌మన్ జి. రవి కుమార్ ఒక్క రోజులోనే 25 టన్నుల యూరియా విక్రయించినట్లు మాన్యువల్ బిల్లులు రైతుల పేరున చూపించారు. దీంతో రైతులను విచారణ అధికారులు ఫోన్‌లో ఆరా తీయగా రెండు మూడు బస్తాలు తీసుకువెళ్లామని 25 బస్తాలు తీసుకువెళ్లడం వాస్తవం కాదని రైతులు విచారణ అధికారికి వివరించారు. దీంతో అధికారులు కంగుతిన్నారు. రవికుమార్‌ను వివరణ కోరగా 23వ తేదీన 21 మంది రైతులకు 23 టన్నులు యూరియా విక్రయించినట్లు చెప్పినప్పటికీ ఆ రోజు డీసీఎంఎస్ ఖాతాలో విక్రయించిన సొమ్ము జమ కాకపోవడంతో పాటు ఈ పోస్ కాకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత నెల 28న జి. రవికుమార్ డీసీఎంఎస్ పెనుమంట్ర స్టాక్ పాయింట్ విధుల నుంచి రిలీవ్ అయ్యే సమయంలో డీసీఎంఎస్ ఎరువుల ఆడిట్ ఆఫీసర్ శ్రీనివాసులు సేల్స్‌మన్ రవికుమార్ నుంచి సుమారు ఎనిమిది లక్షల రూపాయలు జమ చేస్తేనే తప్ప ఆడిట్ పూర్తి చేయనని చెప్పడంతో డబ్బులు చెల్లించి రిలీవ్ అయినట్లు తెలుస్తోంది. రికార్డుల్లో సైతం ఆడిటర్ సంతకాలను విచారణ అధికారులు పరిశీలించారు.

పెనుమంట్ర డీసీఎంఎస్ స్టాక్ పాయింట్‌లో యూరియా నిల్వలో జీరో కాగా, సూపర్ 29 టన్నులు, పొటాష్ 13 టన్నులు, 20.20.20 2.95 టన్నులు, 10-26-0 35 టన్నులు, డీఏపీ 2,450 టన్నులు, నానో యూరియా లిక్విడ్ 325 బాటిల్స్, నానో డీఏపీ లిక్విడ్ 66 బాటిల్స్ డీసీఎంఎస్ గోడౌన్లో నిల్వలో ఉన్నట్లు క్వాలిటీ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ వై రాఘవేంద్రరావు తెలిపారు. యూరియా మాయంపై పశ్చిమ గోదావరి జిల్లా వ్యవసాయ అధికారికి సమగ్ర విచారణ చేసి నివేదిస్తాను రాఘవేంద్రరావు తెలిపారు. ఈ తనిఖీల్లో పెనుమంట్ర మండల వ్యవసాయ అధికారిణి బి. దేవి స్వరూప, ఏఈఓ ఓఎన్ సత్యనారాయణ, సేల్స్‌మన్ బీవీ నతానియేలు, పూర్వపు సేల్స్‌మన్ జి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


పాత సేల్స్‌మన్‌ను విచారిస్తున్న విచారణాధికారి


ఆకివీడులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మికులు

15న లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి

కాళ్ళ/ఆకివీడు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం అమలుతోపాటు వెల్ఫేర్ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని జిల్లా కార్యదర్శి మండా సూరిబాబు డిమాండ్ చేశారు. కాళ్లలో సోమవారం సెప్టెంబరు 15న జరగబోయే లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడి పోస్టర్లను భవన నిర్మాణ కార్మికులు ఆవిష్కరించారు. కార్మిక సమస్యలు, సంక్షేమ పథకాలు పరిష్కారం కోసం ఈ నెల 15న సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడిస్తున్నట్టు భవన నిర్మాణ కార్మిక సంఘం తెలిపింది. సోమవారం ఆకివీడు భవన నిర్మాణ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. అధ్యక్షుడు కేశిరెడ్డి ధనరాజు, ఉపాధ్యక్షుడు నంగెడ్డ ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శి లీలా మనోహర్, కోశాధికారి నూకల సత్తిబాబు తదితరులు ఉన్నారు.

పెయింటర్ల పోస్టుకార్డు ఉద్యమం...

తాడేపల్లిగూడెం: భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డులో పెండింగు క్లెయిమ్స్‌ను వెంటనే పరిష్కరించాలని జరుగుతున్న పోస్టుకార్డు ఉద్యమంలో తాడేపల్లిగూడెం పెయింటర్స్ భాగస్వాములయ్యారు. సోమవారం జరిగిన పెయింటర్స్ నెలవారీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. వెల్ఫేర్ బోర్డుపై శాంతియుత పోరాటాలకు కార్మికులు సిద్ధంగా ఉండాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ పిలుపునిచ్చారు. సీఎం, డిప్యూటీ సీఎంకు ఈ పోస్టుకార్డులు పంపుతున్నట్లు ఆయన వెల్లడించారు.


విద్యార్థులకు బహుమతులు అందించిన దృశ్యం

సాహితీవనంలో చెరగని ముద్రవేసిన ఆరుద్ర

భీమవరంటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సినీ కవి ఆరుద్ర ముద్ర తెలుగు సాహితీ వనంలో చెరిగిపోనిదని రచయిత కలిగొట్ల గోపాలశర్మ అన్నారు. భీమవరం జేఎల్‌బీ మున్సిపల్ హైస్కూల్లో సోమవారం సంస్కార భారతి ఆధ్వర్యంలో ఆరుద్ర శత జయంత్యుత్సవాలను నిర్వహించారు. గోపాలశర్మ మాట్లాడుతూ చిత్రసీమలో ఆరుద్ర పాటలు, మాటలు జనాన్ని ఎంతగానో మురిపించాయన్నారు. చెరుకువాడ రంగసాయి తదితరులు ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఎస్. సత్యనారాయణ రాజు, హెచ్‌ఎం కృష్ణకుమారి, రోహిణి, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్‌గా ఆశ

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్‌గా ఆర్.ఆశ పదోన్నతి, బదిలీపై జిల్లాకు నియమితులయ్యారు. గవర్నమెంట్ ఎగ్జామ్స్ డైరెక్టరేట్ కార్యాలయంలో సూపరిం టెండెంట్‌గా పనిచేస్తున్న ఈమెకు పదోన్నతి కల్పించి బదిలీపై జిల్లాలో నియమించగా, ఆ మేరకు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసిన జయలక్ష్మి డీజీఈ కార్యాలయానికి సూపరింటెండెంట్‌గా వెళ్లిపోయారు. జూన్ నెలలో జిల్లాలో బాధ్యతలు స్వీకరించిన జయలక్ష్మి స్వల్ప వ్యవధిలోనే బదిలీ అయ్యారు. కాగా నూతన అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆశ సోమవారం జిల్లాలో ఎన్ఎంఎంఎస్, ఏపీ ఓపెన్ స్కూల్స్ టెన్త్, ఇంటర్మీడియట్ అడ్మిషన్లు, రిజిస్ట్రేషన్లపై కార్యాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఎన్ఎంఎంఎస్‌కు రిజిస్ట్రేషన్ల గడువు తేదీని ఈ నెల 15 వరకు పొడిగించినందున మండలాల్లో ఎంఈవోలు, హెచ్ఎంలు వీలైనంత ఎక్కువమంది బాలబాలికలు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. దూర విద్య పదో తరగతిలో ప్రవేశాలకు 727 మంది రిజిస్టర్ చేసుకోగా ఇప్పటి వరకు 350 మంది, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు 1345 మంది రిజిస్టర్ కాగా 900 మంది అడ్మిషన్లను ఖరారు చేసుకున్నారని, మిగతా వారంతా నిర్ణీత గడువులోగా అడ్మిషన్ ఫీజు చెల్లించేలా ఏఐ కేంద్రాల కో-ఆర్డినేటర్లు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. బాధ్యతలు చేపట్టిన ఆశకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.



దరఖాస్తు చేయనివారికీ అవార్డులు

వారి పనితీరే పురస్కారానికి ప్రామాణికం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు టీచర్లు కరవవ్వడంతో విద్యాసంబంధిత అంశాల్లో ప్రగతి కనబరిచిన గురువులను క్షేత్రస్థాయిలో తామే గుర్తించి అవార్డులివ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. తొలుత తీసుకున్న నిర్ణయం మేరకు మొత్తం 60 మందికి పురస్కారాలివ్వాల్సి ఉంది. ఆ ప్రకారం స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో 20 మంది టీచర్లకు అవార్డులివ్వాలని ప్రతిపాదించగా 14 దరఖాస్తులు, హెచ్‌ఎంల కేటగిరీలో 10 మందికి పురస్కారాలు అందజేయాలని నిర్ణయించగా 2, ఎస్జీటీ కేటగిరీలో 30 మందికి అవార్డులివ్వడానికి ప్రతిపాదనలను ఆహ్వానించగా 10 మంది నుంచే దరఖాస్తులందాయి. అన్ని కేటగిరీల నుంచి కేవలం 26 మాత్రమే ప్రతిపాదనలందాయి. దీంతో మార్గదర్శకాలను సడలించి... ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎక్కువ మంది విద్యార్థుల చేరికతో అత్యధిక ఎన్‌రోల్‌మెంట్ సాధించిన టీచర్లు, స్కూలు పనిదినాల్లో సెలవులు పెట్టకుండా ఎక్కువ రోజులు హాజరైన ఉపాధ్యాయులు, 2024-25లో పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల హెచ్‌ఎంలు తదితర ప్రామాణికాలను పరిగణనలోకి తీసుకుని అదనంగా 10-15 అవార్డులను అందజేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఆ మేరకు సంబంధిత అంశాల్లో ప్రగతిని కనబరచిన పాఠశాలలు, టీచర్ల వివరాలను సేకరిస్తున్నారు. వీరికి దరఖాస్తుతో సంబంధం లేకుండా పురస్కారాలు అందజేస్తారు. అవార్డులకు ఎంపికైన వారి వివరాలను బుధ లేదా గురువారాల్లో ప్రకటించనున్నారు. కాగా గురుపూజోత్సవం ఈ నెల 5న మిలాద్ ఉన్ నబీ సెలవురోజున రావడంతో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఆ రోజున నిర్వహిస్తారా లేక 4వ తేదీనే పాఠశాలల్లో నిర్వహించుకునేలా వెసులుబాటు కల్పిస్తారా అనే విషయమై టీచర్లలో చర్చనీయాంశమైంది.

శతక పద్యాలతో చిన్నారుల 'గళార్చన'

తణుకు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా మాతృ భాషా పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం తణుకులో జంధ్యాల పాపయ్య శాస్త్రి రచించిన వంద తెలుగు బాల శతక పద్యాలను చిన్నారులు ఆలపించారు. డాక్టర్ ఆకెళ్ళ విభీషణ శర్మ తెలుగుబాల శతక విశిష్టతపై వివరించారు. జంధ్యాల వెంకట రమణ మాట్లాడుతూ చిన్నారులకు తెలుగు భాష పట్ల ఆసక్తి పెంచే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామన్నారు. విద్యార్థుల భరతమాత, తెలుగుతల్లి వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంస్థ అధ్యక్షుడు చర్ల సుభాష్ చంద్రబోస్, సమన్వయకర్త నాగభూషణం పాల్గొన్నారు.


పద్యాలు ఆలపిస్తున్న విద్యార్థులు

మధ్యాహ్న భోజనమే కారణమా?

- 10 మంది విద్యార్థినులకు అస్వస్థత
- ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స

కుక్కునూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 6వ తరగతికి చెందిన పదిమంది విద్యార్థులు సోమవారం అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత వాంతులు అయ్యాయి. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు వెంటనే వారిని సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ వైద్య సిబ్బంది వారికి చికిత్స చేసి 2 గంటల పాటు అబ్జర్వేషన్‌లో ఉంచారు. అనంతరం కోలుకోవడంతో ఇంటికి పంపించారు. విద్యార్థులు తీసుకున్న ఆహారం జీర్ణంకాకపోవడం వల్లే అస్వస్థతకు గురైనట్టు వైద్య సిబ్బంది తెలిపారు. పాఠశాల విరామ సమయంలో బయట ఉన్న దుకాణాల వద్ద కొనుగోలు చేసిన తినుబండరాల వల్లే ఈ సమస్య తలెత్తి ఉండవచ్చని సమాచారం. అయితే తాము ఎటువంటి తినుబండారాలు తినలేదని, భోజనం అనంతరమే తమకు వాంతులైనట్టు అస్వస్తతకు గురైన ఇద్దరు విద్యార్థులు చెబుతున్నారు. తీసుకున్న ఆహారం జీర్ణం కాకపోవడంతో ఈ సమస్య తలెత్తినట్లు స్పష్టమవుతోంది. అయితే ఈ సమస్య బయట తినుబండరాలు తినటం వలన వచ్చిందా? పాఠశాలలో తీసుకున్న ఆహారం కారణమా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.


కుక్కునూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

కుమ్మరగట్టులో డయేరియా

- ఆరుగురికి పీహెచ్‌సీలో, ఇద్దరికి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స

బుట్టాయగూడెం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): లక్ష్మడుగూడెం పంచాయతీ కుమ్మరగట్టు గ్రామంలో డయేరియా ప్రబలి 8 మంది అనారోగ్యం పాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యండమూరి వెంకట లక్ష్మి, బుడిమూరి హరి ప్రసాద్, సంగం అవినాశ్, కోసూరి కోటలక్ష్మి, ఉమ్మడివరపు అచ్చాయమ్మ, ఉమ్మడివరపు శివాజీ, ఉమ్మడివ రపు వాణిశ్రీ, దంగేటి కిరణ్‌కుమార్‌లు వాంతులు, విరేచనాలతో శనివారం నుంచి బాధ పడుతున్నారు. కుమ్మరిగట్టులో డయేరియా ప్రబలిన విషయం సోమవారం తెలుసుకున్న వైద్యాధికారులు హుటాహుటిన గ్రామానికి చేరుకుని నివారణ చర్యలు ప్రారంభించారు. ఆరుగురిని నందాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా ఇద్దరు జంగారెడ్డిగూడెం ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. నందాపురం పీహెచ్‌సీకి పంపినవారు చికిత్స పొంది సోమవారం సాయంత్రం ఇళ్లకు వెళ్లారు. ప్రవేటు ఆసుపత్రుల్లో ఉన్నవారికి చికిత్స కొనసాగుతోంది. విషయం తెలుసుకున్న డీఎం అండ్ హెచ్‌వో డా.అమృత, డీఎస్‌వో నరేంద్రకృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.జె.సురేష్ కుమార్‌లు గ్రామానికి చేరుకుని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. డయోరియా ప్రభలడానికి కారణాలను పరిశీలించారు. ప్రస్తుతం పరిస్థితులు అదుపులోనే ఉన్నట్లు తెలిపారు. డా.సల్మా, సర్పంచ్ మడకం వెంకటలక్ష్మీ, ఎంపీహెచ్‌ఈవో పి.పెద్దిరాజు, ఎస్‌యువో నరేష్ సిబ్బంది పాల్గొన్నారు.


గ్రామంలో పర్యటిస్తున్న డీఎంహెచ్‌వో అమృత

ఆధిపత్య పోరుతోనే హత్య?

- నాని గ్యాంగ్‌పైనే అనుమానం..
- హంతకుల కోసం ప్రత్యేక బృందాలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : ఆ ప్రాంత ప్రజా సమస్యలను ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పార్టీ కార్యకర్తగా ఎదుగుతూ అటు ప్రజా ప్రతినిధుల వల్ల ఇటు ప్రాంత ప్రజల్లో నాయకుడిగా ఎదుగుతూ, తమకు అడ్డంకిగా మారాడని భావించే హత్య చేశారంటూ మృతుని బంధువులు ఆరోపించారు.ఏలూరు రూరల్ మండలం ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న పూనూరి రాజేశ్ టీడీపీ నాయకుడిగా ప్రజా సమస్యలు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నాడు. అతనితోనే ఉంటున్న సరిపల్లి విజయ్ అలియాస్ చిన్ని నానికి ఇది నచ్చలేదు, అలాగే వీరిమధ్య ఆర్థిక లావాదేవీలు ఉన్నట్టు చెబుతున్నారు.నాని ఒక ముఠాను తయారు చేసి రాత్రి వేళ తాము పోలీసులమంటూ హైవేలపై లారీలు ఆపి డ్రైవర్లను బెదిరించి వారి నుంచి సొమ్ములు వసూలు చేయడం, ఏలూరు మినీ బైపాస్ రోడ్డు, సీఆర్ఆర్ పాలిటెక్నిక్ కాలేజీ సమీపంలో ఎవరైనా జంటలు బైక్ ఆపి మాట్లాడుకుంటుంటే ఫొటోలు తీసి బెదిరించడం వంటి పనులకు పాల్పడుతున్నట్టు ఆరోపణలున్నాయి. పది రోజుల క్రితం ఏలూరు మినీ బైపాస్ రోడ్డులో ఒక జంటపై బెదిరింపులకు పాల్పడగా ఆశ్రం ఆస్పత్రి వద్ద బంధువులు అడ్డుకుని వారిని ప్రశ్నించి నిలదీశారు. తాము పూనూరి రాజేశ్ అనుచరుడినని చెప్పారు. పట్టుబడిన నానీ బ్యాచ్ రాజేశ్‌తో మాట్లాడించారు. నానీ తన వద్ద ఉండటం నిజమేనని నేరాలు చేస్తే తమకు సంబంధం లేదని, మీరు ఏమైనా చేసుకోండంటూ చెప్పి ఫోన్ పెట్టాడు. దీంతో నాని గ్యాంగ్‌కు దేహశుద్ధి చేసి ఫోను కూడా లాక్కున్నట్టు సమాచారం. తన సహకారంతో రాజేశ్ ఎదిగి తనను కాపాడలేదని కక్ష పెంచుకున్నట్టు భావిస్తున్నారు. రాజేశ్ లేకపోతే తానే ఇందిరమ్మ కాలనీకి నాయకుడిగా ఎదగవచ్చని భావించి నాని ఈ హత్యకు తెగబడ్డట్టు తెలుస్తోంది. పోలీసులు ఈ ముఠాను అరెస్టు చేసేందుకు మూడు ప్రత్యేక బృందాలను రంగంలోకిదించారు. రెండ్రోజుల్లో హంతకులను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయనున్నారు. ఈహంతకులకు ఇంకా ఎవరి సహకారమైనా ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. రాజేశ్ మృత దేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో సోమవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.


రాజేశ్ మృతదేహం (ఇన్‌సెట్‌లో ఫైల్)

ఫార్మసీ కంపెనీ డైరెక్టర్ అనుమానాస్పద మృతి?

పాలకోడేరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గరగపర్రు గ్రామానికి చెందిన ఫార్మసీ కంపెనీ డైరెక్టర్ మంతెన వరప్రసాదరాజు(58) వైజాగ్‌లో సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు బంధువులు చెబుతున్నారు. గరగపర్రు గ్రామానికి చెందిన వసుధ ఫౌండేషన్ చైర్మన్ సోదరుడు కృష్ణంరాజు కుమారుడైన వరప్రసాదరాజు వైజాగ్‌లోని ఫార్మసీలో డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ఆదివారం స్నేహితులతో కలిసి తిరిగిన ప్రసాదరాజు రాత్రికి ఇంటికి కూడా చేరుకున్నాడని, ఏమైందో ఏమోగాని హఠాత్తుగా మృతి చెందినట్టు స్థానికులు చెబుతున్నారు. ఆయన మృతదేహాన్ని బంధువులు భీమవరం తీసుకువస్తున్నట్టు సమాచారం. ప్రసాదరాజుకు భార్య, ఇద్దరు కుమారులున్నారు.

ట్రాక్టర్ ధ్వంసం చేసి బ్యాటరీల చోరీ

పెనుమంట్ర, సెప్టెంబరు(ఆంధ్రజ్యోతి):పొలమూరు కేపీఆర్ కాలనీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఇటుకల బట్టీ వద్ద ట్రాక్టర్‌ను ధ్వంసం చేసి బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు ఇటుకలబట్టీ యాజమాని పిల్లి రామకృష్ణ పెనుమంట్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఆదివారం రాత్రి ఇటుకల బట్టీ ప్రాంతంలో నిలిపి ఉంచిన ట్రాక్టర్‌ను ధ్వంసం చేసి బ్యాటరీ దొంగిలించినట్టు ఫిర్యాదు చేశాడు.

యువతుల అదృశ్యంపై కేసు...

పెనుమంట్ర మండలం పొలమూరు గ్రామానికి చెందిన ఇద్దరు యువతులు ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు పెనుమంట్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. భీమవరంలో పారామెడికల్ చదువుతున్న విద్యార్థినులు శనివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో అదృశ్యమైనట్టు వి.చిన్న ఫిర్యాదు చేశారు. ఎస్.ఐ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్ బోల్తా కొట్టి డ్రైవర్ మృతి

ఉంగుటూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తల్లాపురం రహదారిలో సోమవారం ఉదయం ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టడంతో డ్రైవర్ రాంబాబు(60) అక్కడికక్కడే మృతి చెందాడు. చేబ్రోలు పోలీసుల కథనం ప్రకారం భీమడోలు మండలం గుండుగొలను నుంచి భీమవరం వెళుతున్న ట్రాక్టర్ అదుపు తప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో సింగులూరి రాంబాబు మృతి చెందాడు. ఎస్.ఐ. మామిడాల సూర్య భగవాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


పెదతాడేపల్లి వద్ద కారు బోల్తా

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో కారు చెరువులో బోల్తాకొట్టింది. తాడేపల్లిగూడెం నుంచి నల్లజర్ల వెళ్తుండగా అదుపు తప్పి చెరువు పక్కన బోదెలో పడింది. ఈ సంఘటనలో కారు నడుపుతున్న వ్యక్తి క్షేమంగా బయటకు రావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అత్తిలి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన కేతా సాయిబాబు(60) రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. సాయిబాబు, మంచిలి నుంచి తాడేపల్లిగూడెం వెళ్ళే రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా పాలూరు డాంవద్ద రోడ్ దాటుతున్న సమయంలో మోటారు బైక్ ఢీకొట్టాడు. క్షతగాత్రుడిని 108 అత్యవసర వాహనంలో తణుకు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమండ్రి ఆసుత్రికి తరలించినట్టు అత్తిలి ఎస్ఐ పి.ప్రేమరాజు తెలిపారు. సాయిబాబు కుమార్తె కడలి భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మద్ది క్షేత్రంలో పవిత్రోత్సవాలు ప్రారంభం

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో ఉన్న శ్రీమద్ది అంజనేయస్వామి క్షేత్రంలో పవిత్రోత్సవాలు జరుగుతున్నందున భక్తులకు స్వామి వారి గర్భాలయ దర్శనం సోమవారం మధ్యాహ్నం నుంచి నిలిపివేసి తిరిగి 4వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల నుంచి పునఃప్రారంభిస్తామని ఆలయ ఈఓ ఆర్‌వి.చందన తెలిపారు. స్వామి వారి పవిత్రోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. సాయంత్రం ఆరు గంటల నుంచి స్వామికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా బ్యాంకు సేవలు

పెదవేగి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా బ్యాంకు సేవలు అందిస్తున్నామని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ చింతమనేని శ్రీనివాస్ అన్నారు. పెదవేగిలోని చైతన్య గోదావరి బ్యాంకు మేనేజరుగా పనిచేస్తూ ఏలూరు రీజనల్ ఆఫీసుకు బదిలీపై వెళ్తున్న ఆయనను సహోద్యోగులు, మహిళా సంఘాలు, గ్రామస్థులు సోమవారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనతోనే కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయన్నారు.

బార్ కేటాయింపులో అవకతవకలంటూ ధర్నా


ధర్నా చేస్తున్న శెట్టిబలిజ నాయకులు

ఏలూరు రూరల్, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి):తమకు కేటాయించిన ఒక్క బార్‌నూ సిండికేట్ సభ్యులు అక్రమ మార్గంలో కైవసం చేసుకున్నారంటూ శెట్టిబలిజ సంఘం నేతలు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి జేసీ ధాత్రిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం గౌరవ అధ్యక్షుడు వీరవల్లి వెంకటేశ్వర్లు, జిల్లా అ ధ్యక్షుడు కోడి దుర్గారావు మాట్లాడుతూ ఏలూరులో తమకు కేటాయించిన బార్‌ను బైరెడ్డి విజయకుమార్ అనే వ్యక్తికి అధికారులు అక్రమంగా లైసెన్స్ ఇచ్చారని, శెట్టిబలిజ కుల జాబితాలో బైరెడ్డి అనే ఇంటి పేరుతో ఎవరూ లేరని, మద్యం సిండికేట్‌లో బడాబాబులకు బినామీగా ఉన్న విజయ్‌కుమార్ టెండర్ వేశారని ఆరోపించారు. అతన్ని అడిగితే తమ బాస్ వేయమంటే వేశానని, తనకు ఏమి తెలియదని చెప్పాడన్నారు. అతడు ప్రభుత్వానికి సమర్పించిన కుల ధ్రువీకరణ పత్రం సరైంది కాదన్నారు. కడలి శ్రీనివాస్, యాండ్ర నాగరాజు, గుబ్బల రాము, చింతపల్లి రామకృష్ణ, చింతపల్లి గోవింద్, వి.మధుసూదనరావు ధర్నాలో పాల్గొన్నారు.

గణపవరాన్ని 'పశ్చిమ'లోనే ఉంచండి

ఉంగుటూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గణపవరం మండలాన్ని పశ్చిమ గోదావరి జిల్లాలోనే ఉంచాలని అఖిలపక్షం వినతి పత్రం సమర్పించింది. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు వినతి పత్రం అందించారు. భీమవరం కేవలం కొద్ది దూరంలోనే ఉందని ఏలూరు 70 కిలోమీటర్లు ఉంటుందన్నారు. సమస్యల పరిష్కారానికి భీమవరం తక్షణం వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. వినతిపత్రం అందించిన వారిలో టి.డి.పి. నాయకులు ఇందుకూరి రామకృష్ణంరాజు, కూసంపూడి సురేంద్రరాజు, బీజేపీ నాయకులు నాయకుడు నంద్యాల రామలింగరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పాతపాటి హరికుమార్ రాజు, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షులు ముత్యాల వేణు, బాతు నాగేశ్వరరావు, కాపవరం చిన్న, వైస్సార్ కాంగ్రెస్ నాయకులు నడింపల్లి సోమరాజు, యాళ్ల సుబ్బారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి పవిత్రోత్సవాలు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఈనెల 2నుంచి 5వ తేదీ వరకు శ్రీవారి 24వ వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీశ్ కుమార్, ఆలయ ప్రధానార్చకులు కిళాంబి మారుతి శ్రీనివాస రామానుజాచార్యులు తెలిపారు. మంగళవారం సాయంత్రం ప్రత్యేక పూజలు, 3న స్వామికి హయగ్రీవ హవనం, 4న సుదర్శన నరసింహ హవనం, 5న మహా పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ పవిత్రోత్సవాల్లో వేద పండితులు బ్రహ్మశ్రీ యనమండ్ర వేంకట రవిప్రకాశ్ శర్మ అవధాని, టీటీడీ స్వర్ణపతక గ్రహీత శ్రీమాన్ కిళాంబి వేంకట పవన కృష్ణ మాచార్యులు భక్తులతో పూజలు చేయిస్తారన్నారు. మధురైకి చెందిన కె.ఇ.బాలాజీ నలాయిర ప్రబంధ పారాయణం నిర్వహిస్తారని తెలియజేశారు.

ఏసీ, ఫ్రిజ్, వాషింగ్ మెషిన్ రిపేర్‌పై ఉచిత శిక్షణ

పెదపాడు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంత యువతీ యువకులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా ఏసీ, ఫ్రిజ్, వాషింగ్ మెషిన్ రిపేర్‌పై శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 22వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, శిక్షణ కాలంలో ఉచితంగా భోజనం, ఉచిత స్టడీ మెటీరియల్, వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి గల ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 19 నుంచి 45 సంవత్సరాలు వయస్సుగల వారు కనీస విద్యార్హత 5వ తరగతి ఆపైన ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 95027 23561, 95330 79471 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

జంగారెడ్డిగూడెం-మైసన్నగూడెం రోడ్డు కోసం వినతి

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం నుంచి శ్రీనివాసపురం మీదుగా మైసన్నగూడెం వెళ్లే ప్రధాన రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం మండల కమిటీ సభ్యుడు జి.సూర్యకిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఆర్డీవో ఎం.వి. రమణకు వినతి పత్రం అందజేశారు. సూర్యకిరణ్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి రహదారిని పట్టించుకునే నాథుడేలేడని విమర్శించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో మైసన్నగూడెం ప్రజలతో జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తామన్నారు.

కేఆర్ పురం ఐటీడీఏ డీడీగా జగన్నాథం

బుట్టాయగూడెం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కేఆర్‌పురం ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు (డిప్యూటీ డైరెక్టర్)గా పిన్నింటి జగన్నాథం నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులు ఐటీడీఏకు అందాయి. చింతూరు ఐటీడీఏలో అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసరుగా ఉన్న ఆయన పదోన్నతిపై కేఆర్ పురం ఐటీడీఏకు డీడీగా వస్తున్నారు. ఇక్కడ పనిచేసిన వీవీఎస్ నాయుడు మొదట దీర్ఘకాలిక సెలవు పెట్టి తర్వాత బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఏటీడబ్ల్యూవో శ్రీవిద్యకు ఇన్‌చార్జి బాధ్యతలను పీవో కె.రాములు నాయక్ అప్పగించారు. జగన్నాథం బుధవారం బాధ్యతలు స్వీకరిస్తారని సమాచారం.

ఆదుకోవాలని టాటా మ్యాజిక్ ఓనర్లు, డ్రైవర్ల ధర్నా

ఏలూరు రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆటో, టాటా మ్యాజిక్, క్యాబ్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ ఏలూరు టాటా మ్యాజిక్ ఓనర్స్, డ్రైవర్స్ ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. తొలుత ఏలూరు పాత బస్టాండ్ వద్ద నుంచి ప్రదర్శనగా బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వల్ల టాటా మ్యాజిక్ సర్వీస్ ఆదాయం తీవ్రంగా దెబ్బతిని కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. యర్రా శ్రీనివాసరావు, ఎస్.దుర్గారావు, బి.వెంకటేష్, పి.భీమా భద్రరావు, పి.వెంకటరమణ, పి.గోపాల్, టి.దుర్గారావు, కె.సుధాకర్, ఎండీ ఫరూక్, హర్షవర్ధన్ సాయి, జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుటేరు.. ప్రక్షాళన

(5వ పేజీ తరువాయి)

ఎక్స్‌కవేటర్లతో నీటి సంఘాల నాయకులు, డ్రెయినేజీ శాఖ అధికారుల పర్యవేక్షణతో తొలగింపు చర్యలను వేగవంతంగా నిర్వహిస్తున్నారు. వంతెన దిగువ భాగాన్న యాగన మిల్లి, గుడివాడలంక వంటి గ్రామాల్లో రహదారిలో ఏర్పాటు చేసిన తూములు చిన్నవిగా ఉండడంతో వాటిని తొలగించేందుకు ఆ ప్రాంత ఎమ్మెల్యే చింత మనేని ప్రభాకర్‌తో కలిసి కామినేని వాటిని పరిశీలించి పనులు చేపట్టేలా సూచనలు చేశారు. కాగా ఎగువ నుంచి వస్తున్న వరదనీరు ఎప్పటికప్పుడు ఉప్పుటేరు ద్వారా సముద్రంలోనికి వెళు తుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మరలా కొల్లేరు, తమ్మిలేరు, రామిలేరు, బుడమేరు ప్రాంతా ల నుంచి భారీగా వరదనీరు కొల్లేరులోకి చేరు తోంది. ఈ పనులు నిర్వహించడం వల్ల ఎగువ నుంచి ఎన్ని వేల క్యూసెక్కుల నీరు కొల్లేరులోకి వచ్చినా ప్రవాహానికి అవరోధం లేకుండా ఉప్పుటేరు లోకి చేరుతుంది. పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆకివీడు మండలం అయిభీమవరం, చెరుకుమిల్లి, మందపాడు, కాళ్ళ మండలం ఏలూరుపాడు, తదితర గ్రామాల్లో డ్రెయినేజీశాఖ అధికారులు కిక్కిస, గుర్రపు డెక్కను నివారించేందుకు డ్రోన్లతో మందులను పిచికారీ చేయడంతో పాటు ఎక్కడికక్కడే ఎక్స్‌కవేటర్లతో ఉప్పుటేరులోని ఆక్రమణలను తొలగిస్తున్నారు.

మరో 50 మందికి..!

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం ఆదేశించిన విషయం విదితమే. ఇలా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల్లో రీవెరిఫికేషన్ చేయించుకున్న వారికి రెండోసారి సదరం సర్టిఫికెట్లను కొత్తగా ప్రభుత్వం జారీచేసింది. అయితే రెండోదఫా జారీచేసిన సదరం సర్టిఫికె ట్లలోనూ పలు అవకతవకలు చోటు చేసుకున్నట్టు తాజాగా మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో జరిపిన నిర్ధా రణ పరీక్షలో డీఎస్సీ వైకల్య అభ్యర్థులు కొందరిని తిరస్కరించడమే దీనికి నిదర్శనమని ప్రచారం జరు గుతోంది. మరోవైపు వైకల్య శాతం ఎప్పుడూ ఒకేలా ఉండదని, హెచ్చుతగ్గులు సహజమని, తాజాగా కొందరు అభ్యర్థులను తిరస్కరించడం ఇదే కోవలోకి వస్తుందని తెలుస్తోంది. కాగా నలుగురు వీహెచ్ అభ్యర్థుల వైకల్య శాతాన్ని, సదరం సర్టిఫికెట్లను మెడికల్ బోర్డు తిరస్కరించినట్టు తమ వద్ద సమాచారం ఏదీ లేదని విద్యా శాఖ వర్గాలు వివరించాయి.

ఇంటి వద్దకే పింఛన్లు..

తెల్లవారు జాము నుంచే పంపిణీ ప్రారంభం
పలు చోట్ల స్వయంగా ఎమ్మెల్యేల అందజేత


పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా తెల్లవారు జాము నుంచే పింఛన్ల పంపిణీ చేపట్టినట్టు కలెక్టర్ కే.వెట్రిసెల్వి తెలిపారు. ఏలూరు రామకృష్ణాపురంలో ఎన్టీఆర్‌భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి చంటితో పాటు కలెక్టర్ వెట్రిసెల్వి పాల్గొన్నారు.అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈ నెల పింఛన్లు జిల్లాలో రూ. 2లక్షల 61,221మందికి రూ.114.13 కోట్లు అందించామన్నారు. పింఛన్లు అందుకోనివారికి 2న అందిస్తామన్నారు. ఇంటింటికి వెళ్లి వితంతువులు, వృద్ధులు, వ్యాధిగ్రస్థుల యోగక్షేమాలు తెలుసుకుని పింఛన్లు అందజేశారు.ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోయినా పింఛన్ల సమయానికి అందిస్తున్నట్టు తెలిపారు. డిప్యూటీ మేయర్ కే.ఉమామహేశ్వరరావు, ఇడా చైర్మన్ శివప్రసాద్, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ ఎస్ఎంఆర్.పెదబాబు, కార్పొరేటర్ ఆదిలక్ష్మి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, తహసీల్దార్ గాయిత్రీ పాల్గొన్నారు.

● ఏలూరుటూటౌన్: చిట్టివలసపాకల ప్రాంతంలో ఎమ్మెల్యే చంటి పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యేతో పాటు ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబులు పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు కిల్లారిశెట్టి సంధ్యా సురేశ్, కార్పొరేటర్లు కె.రామ్మోహన రావు, చీఫ్ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాసరి అంజనేయులు,ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, మునిసిపల్ కమిషనర్ భాను ప్రతాప్, టీడీపీ అధ్యక్షుడు చోడే వెంకట రత్నం పాల్గొన్నారు.

● దెందులూరు: నియోజకవర్గంలో 35 వేల 80 మందికి ఫిచన్‌దారులకు నెలకు రూ.35 కోట్ల 20లక్షలు అందిస్తున్నామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. సోమవారం కొవ్వలిలో టీడీపీ గ్రామాధ్యక్షుడు బగాతి చిన్నారావు, బ్యాంక్ అధ్యక్షుడు వెలమాటి అనిల్ కుమార్ ఎంపీడీవో శ్రీదేవితో కలిసి చింతమనేని లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ అందించారు. టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్, మోతుకూరి నానిలతో కలిసి నూతన స్మార్ట్ రేషన్ కార్డులను తహసీల్దార్ సుమతితో కలిసి చింతమనేని అందజేశారు. అనంతరం దెందులూరులోని పంచాయతీ కార్యాలయం పక్కన నూతనంగా నిర్మించనున్న ఎన్టీఆర్ అన్న క్యాంటీన్‌ను దెందులూరు సొసైటీ అధ్యక్షుడు గారపాటి కొండయ్య చౌదరి, సర్పంచ్ యేసమ్మలతో కలిసి శంకుస్థాపన చేశారు. గ్రామంలో పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ బాండ్‌లను యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ మహేష్ యాదవ్, ఇప్పిలి వెంకటేశ్వరరావు, బొడ్డేటి మోహన్‌బాబు, కసుకూర్తి రామకృష్ణ, వెలమాటి రాంబాబు, నున్న లక్ష్మణ్, యలమర్తి శ్రీనివాస్ ఉన్నారు.

● జంగారెడ్డిగూడెం: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో పింఛన్ల పంపిణీలో కిశోర్ పాల్గొన్నారు. కిశోర్ మాట్లాడుతూ పింఛన్లు తొలగిస్తున్నారని కూటమి ప్రభుత్వంపై వైసీపీ అసత్య ప్రచారం చేస్తోందన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు పరిమి సత్తిపండు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చిట్టిబోయిన రామ లింగేశ్వరరావు, పెనుమర్తి రామ్ కుమార్, మద్దిపాటి నాగేశ్వరరావు, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, షేక్ ముస్తఫా పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. బర్రింకలపాడులో సోమవారం ఎన్టీఆర్ భరోసా పథకంలో ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేశారు. అర్హులైన అందరికీ పింఛన్లు అందేలా కృషి చేస్తున్నామన్నారు.నూతనంగా 750 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. నియోకవర్గంలో 43,999 మంది నెల నెలా పింఛన్లు పొందుతున్నారన్నారు. కొత్తగా పింఛన్లు పొందిన వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పిన్నమనేని మధు, నాలి శ్రీను ఉన్నారు.

● లింగపాలెం:ప్రతి నెలా మొదటి తేదీన రాష్ట్రంలో పండుగ వాతావరణం కనిపిస్తోందని వృద్ధులు,వికలాంగులు, వితంతువుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని చింతలపూడి నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు, సింగగూడెం సొసైటీ చైర్మన్ మోరంపూడి మల్లికార్జునరావు అన్నారు. మండలంలో 7,850 మందికి ప్రతినెలా పింఛన్లు అందిస్తున్నామన్నారు. బొంతు రాంబాబు, తాతిన రాధాకృష్ణ, బొంతు శ్రీను పాల్గొన్నారు.

● టి.నర్సాపురం: రాష్ట్ర అభివృద్ధి బాబుతోనే సాధ్యమని మల్లుకుంట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్‌పర్సన్ శీలం సాయి వినయ్ తెలిపారు. సీఎంగా చంద్రబాబు 30వ సంవత్సరంలోకి అడుగిడిన సందర్భంగా వీరభద్రవరంలో సోమవారం కేకుకట్ చేసి స్వీట్లు పంచారు. సర్పంచ్ నైనారపు జలపాలు, వీఆర్వో దత్తు, పంచాయతీ కార్యదర్శి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


స్మార్ట్ రేషన్ కార్డు అందజేస్తున్న జేసీ, ఎమ్మెల్యే


లింగపాలెంలో రేషన్ కార్డులు అందజేసిన రోషన్


భీమడోలులో రేషన్ కార్డు అందజేస్తున్న పత్సమట్ల

ఇకపై స్మార్ట్‌గా రేషన్ పంపిణీ

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇచ్చే రేషన్ పక్కదారిపట్టకుండా, దుర్వినియోగం కాకుండా ఉండేందుకు కూటమి ప్రభుత్వం ఈ-స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తోందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు.ఏలూరు నగరం చొదిమెళ్లలో జాయింట్‌కలెక్టర్ ధాత్రిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే చంటి ఈ-రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి ఈ నెల 5వ తేదీలోపు ఈ స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ నూతన టెక్నాలజీ వినియోగించి ఈ రేషన్ కార్డులు తయారు చేశారన్నారు. ఒకరి రేషన్ మరొకరు తీసుకెళ్లడానికి ఆస్కారం ఉండదన్నారు.బొద్దాని శ్రీనివాస్, ఎస్ఎంఆర్ పెదబాబు, ఎం.పార్థసారథి పాల్గొన్నారు.

● లింగపాలెం: పేదలకు ఉపయోగపడే విధంగా ఎటువంటి అక్రమాలు తలెత్తకుండా అధునిక సాంకేతికతను జోడించి నిత్యావసర సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టేందుకే ఈ స్మార్ట్‌రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందిస్తున్నామని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. మండలంలోని లింగపాలెంలో స్థానిక కూటమి నాయకులతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజలకు పంపిణీ చేశారు.తహసీల్దార్ నజీముల్లాషా, ఎంపీడీవో కె.వాణి, గరిమళ్ల చలపతిరావు, మోరంపూడి మల్లికార్జునరావు, రాధాకృష్ణ, బొంతు రాంబాబు, చెన్ను శ్రీనివాస్ యాదవ్, అసిలేటి అజయ్ పాల్గొన్నారు.

● కామవరపుకోట: స్మార్ట్ రేషన్‌కార్డులు దేశంలోనే ఆదర్శనీయంగా ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ పేర్కొన్నారు.సోమవారం కామవరపుకోటలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ గెడ్డం ఎలీషా, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబు, సొసైటీ చైర్మన్ ఘంటా మాధవరావు, టీడీపీ నేత కిలారు సత్యనారాయణ ఉన్నారు.

● భీమడోలు: పారదర్శకతతో కూడిన మెరుగైన సేవలను అందించేందుకే స్మార్ట్ కార్డులను ప్రవేశపెట్టామని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలులో స్మార్ట్ రైస్ కార్డులను ఎమ్మెల్యే ధర్మరాజు లబ్ధిదారులకు అందజేశారు.

● పెదవేగి: స్మార్ట్ కార్డులతో రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత ఉంటుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగితో పాటు లక్ష్మీపురం గ్రామంలో సోమవారం స్మార్ట్ కార్డులు, పింఛన్ల పంపిణీ చేశారు. పెదవేగి సొసైటీ అధ్యక్షుడు తాతా సత్యనారాయణ, పెదవేగి, లక్ష్మీపురం గ్రామ సర్పంచ్‌లు తాతా శ్రీరామ్మూర్తి, మేకా కనకరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గణేశ్ ఉత్సవాలు


గణేశ్ ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు డివిజన్లలో గణేష్ ఉత్సవాలు ఆరవ రోజుకు చేరుకున్నాయి. ఈ ఉత్సవాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు గణేష్ ఉత్సవాల్లోని గణనాథుడిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని భక్తి సంకీర్తనలు ఆలపించి భజనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించడంతో గణేశ్ ఉత్సవాల శిబిరాలన్నీ కిటకిటలాడుతున్నాయి. నరసింహారావుపేటలోని కట్టా సుబ్బారావు వీధిలో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాల శిబిరంలో ఆర్టీసి విజయవాడ జోన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు పూజలు నిర్వహించారు. చేపల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాల్లో నగరపాలక సంస్థ కో-ఆప్షన్ మెంబర్ ఎస్ఎంఆర్ పెదబాబును ఉత్సవ కమిటీ సభ్యులు దుశ్శాలువాతో సత్కరించారు. సత్రంపాడులో జరుగుతున్న గణేష్ ఉత్సవాల్లో మహిళా ప్రతినిధులు సామూహికంగా స్వామివారిని ఆరాధించారు.బావిశెట్టివారిపేట, వన్‌టౌన్, టూటౌన్, ఆర్ఆర్ పేట, తంగెళ్ళమూడి తదితర ప్రాంతాలతో పాటు కుండీ సెంటర్, రామకోటి ప్రాంగణాల్లో గణేశ్ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రామకోటి ప్రాంగణంలో స్వామివారికి భక్తులు సోమవారం బిల్వార్చన నిర్వహించారు. కూరగాయల మార్కెట్ వద్ద గల భారీ గణనాథుడిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు నిర్వహించారు.

● నిడమర్రు: సిద్ధాపురం, ఛానమిల్లి, భువ్వనపల్లి, నిడమర్రు, పెదనింద్రకొలను గ్రామాల్లో గణేశ్ నిమజ్జన కార్యక్రమాలు కోలాహలంగా జరుగుతున్నాయి. సిద్ధాపురంలో నిర్వహించిన గణేశ్ నిమజ్జనంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.చినకాపవరం పంట కాలువలో గణపతి మట్టివిగ్రహాన్ని నిమజ్జనం చేశారు. భువ్వనపల్లి వెలమపేటలో 49వ గణేష్ ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి.

● పెదపాడు: పెదపాడు శివారు రామచంద్రాపురంలో వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. రామచంద్రాపురం యూత్ ఆధ్వర్యంలో భక్తులచే పూజలందుకున్న వినాయకుని విగ్రహాన్ని ట్రాక్టరుపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. దారిపొడవునా భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● జీలుగుమిల్లి: మండలంలో పలు గ్రామాల్లో గణనాథుడికి నిమజ్జనాలు ఉత్సాహంగా జరిగాయి. జీలుగుమిల్లిలో ఆర్యవైశ్య సంఘం, సిద్ధి వినాయక యూత్, బాల గణేశ్ యూత్ ఆధ్వర్యంలో మండలపాల వద్ద ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహాల ఊరేగింపు జరిగింది. సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో వినాయకుడి లడ్డూ పాట రూ.50 వేలకు మహిళలు దక్కించుకున్నారు. గ్రామ వీధుల్లో పండుగ వాతావరణం కన్పించింది.

చంద్రబాబుతోనో రాష్ట్రాభివృద్ధి సాధ్యం : ఎంపీ


సీఎంకు శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీ మహేశ్

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదటి సారిగా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మహేశ్ మాట్లాడుతూ తెలుగుజాతి చరిత్రను 1995 సెప్టెంబర్ 1వ తేదీ మలుపుతిప్పిన రోజన్నారు. అప్పటి నుంచి నాలుగు సార్లు ముఖ్యమంత్రి పదవి చేపట్టి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు అయ్యారన్నారు. రాష్ట్రభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమనే బలమైన ముద్ర ప్రజల్లో బలంగాఉందన్నారు.

● కొయ్యలగూడెం: చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 30 సంవత్సరాలు అయిన సందర్భంగా సోమవారం టీడీపీ నాయకులు కేకుకట్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్ పారేపల్లి రామారావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు నిబద్ధత కలిగిన నాయకుడన్నారు. ఉమ్మడి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని ఈ సందర్భంగా తెలిపారు. టీడీపీ నాయకురాలు గంగిరెడ్ల మేఘలాదేవి, బెల్లాని శ్రీనివాస్, బొబ్బర చినరాజు, తదితరులు ఉన్నారు.

● బుట్టాయగూడెం: ప్రజల వద్దకే పాలన తెచ్చి న ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డికే దక్కుతుందని ఏపీ ట్రైకార్ చైర్మన్, పోలవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసులు అన్నారు. చంద్రబాబు నాయుడు మొదటి సారిగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి నేటికి 30 ఏళ్లు అయిన సందర్భంగా బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చాప రవి, కొవ్వాసి శ్రీను, ముచ్చిక కృష్ణ, కారం సురేష్, చంద్రు బాబూరావు, మడకం శ్రీను పాల్గొన్నారు.

అల్లు కుటుంబానికి కరాటం పరామర్శ

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రముఖ హాస్య నటుడు అల్లు రామలింగయ్య సతీమణి, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ మాతృమూర్తి అల్లు కనకరత్నం మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం సినీ నిర్మాత, మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు హైదరాబాద్‌లో అల్లు అరవింద్‌ను పరామర్శించి, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా అల్లు కనకరత్నం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

అనంతకు సేవాలాల్ పేరు పెట్టండి

చింతలపూడి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బంజార భజరంగి బేరి సంఘం ఆధ్వర్యంలో మండలంలోని నామవరం, పంతంగులగూడెం, రేచర్ల, వెంకటాపురం గ్రామాల్లో సేవాలాల్ మహరాజ్ పేరును అనంతపురం జిల్లాకు పెట్టాలని ఈ సంఘం పోస్టు కార్డుల ఉద్యమాన్ని చేపట్టింది. సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ 20 కోట్ల మంది గోర్‌బంజారా చేత ఆరాధింపబడుతున్న సేవాలాల్ మహరాజ్ పేరు పెట్టాలని కోరారు. రేచర్ల కమిటీ నాయకులు భూక్యా శివ పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అన్నా క్యాంటీన్‌లో భోజనాలు చేసేవారికి ఎటువంటి అసౌ కర్యం కలగకుండా చూసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఏ.భానుప్రతాప్ తెలిపారు. స్టేట్ బ్యాంకు మేయిన్ బ్రాంచ్ వద్ద అన్నా క్యాంటీన్‌ను భానుప్రతాప్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. వంట పాత్రలు, ప్లేట్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని హెచ్చరించారు. భోజనం చేస్తున్నవారిని భోజనాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అన్నా క్యాంటీన్స్‌లో మంచి రుచికరమైన భోజనం పేదలకు అందిస్తున్నామన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలకు అన్నాక్యాంటీన్లు ఉపయోగకరంగా ఉన్నాయన్నారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

చింతలపూడి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి):భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కనస్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డులో సీఎంకి పంపడానికి పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా సమితి కార్యదర్శి సి.హెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న 42 వేల క్లెయిమ్‌లను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఎంకి పంపే పోస్టుకార్డు ఉద్యమం చేపట్టామని, ఇందులో భాగంగా కార్డు ఉద్యమం చింతలపూడిలో ప్రారంభించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో వేలాది మంది సభ్యత్వంతో కూడిన సంక్షేమ బోర్డును పరిరక్షిస్తామన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

లింగపాలెం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తమ్మిలేరుకు వరద ఉధృతి పెరగడంతో ప్రాజక్టు గేట్లను ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారని కావున మండలంలోని యడవల్లి, కొణిజర్ల, ధర్మాజీగూడెం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లింగపాలెం మండల తహసీల్దార్ నజీముల్లాషా తెలిపారు. ఆయా గ్రామాలలో పనిచేస్తున్న వీఆర్‌ఓలు, వీఆర్ఏలు పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ తనకు సమాచారం అందించాలన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

చింతలపూడి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ చలో విజయవాడ కార్యక్రమం పోస్టర్‌ను ఉపాధ్యాయ సంఘ నాయకులు సోమవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు బుచ్చిబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి హామీ ఇచ్చిన విధంగా మాట నిలబెట్టుకోవాలని, చలో విజయవాడ కార్యక్రమానికి ఉపాధ్యాయ సంఘాలన్నీ సంపూర్ణ మద్దతు ఇచ్చాయన్నారు. నాయకులు కాంతారావు, ప్రభాకర్, రాజేంద్ర, మురళీ, శ్రీనివాసరావు, వేణు, రాంబాబు, అప్పారావు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం

బుట్టాయగూడెం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడేనికి చెందిన దేవరకోట పాండు రంగారావు అమెరికాలో ఉంటున్నాడు. తన బాల్య స్నేహితుడు కొత్తపేటకు చెందిన ఎర్రమళ్ళ ఆశోక్‌కుమార్ ప్రమాదంలో గాయపడి నడవలేని స్థితిలో ఉన్నాడని తెలిసి వైద్య ఖర్చుల కోసం రూ.50 వేలు ఆర్థిక సాయం చేశాడు. బుట్టాయగూడెంలో ఉంటున్న రంగా అన్నయ్యలు మరికొంతమంది స్నేహితులు సోమవారం 50 వేల నగదును ఆశోక్ కుమార్ తల్లిదండ్రులకు అందజేశారు. కష్టకాలంలో ఉన్న కుటుంబాన్ని విదేశాల్లో ఉన్నప్పటికీ ఆదుకున్న రంగాను పలువురు అభినందించారు.

ఐవీఎఫ్ క్లినిక్‌ల పరిశీలన

ఏలూరుఅర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ/సరోగసీ (అద్దె గర్భం/ప్రత్యామ్నాయ గర్భధారణ క్లినిక్) కేంద్రాలను అనుమతి లేకుండా నిర్వహిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం హెచ్చరించారు. ఏలూరు, నూజివీడులలో నిర్వహిస్తున్న మూడు ఏఆర్టీ/సరోగసీ కేంద్రాలను సందర్శించిన ఆమె మాట్లాడుతూ పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టప్రకారం అనుమతి పత్రాలను డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి పొందిన తర్వాత కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తును జాతీయ రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ ద్వారా చేసుకుని అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. ఆమెవెంట ఎన్‌సీడీ జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ సరేంద్ర కృష్ణ, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.


స్వాతిని సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు


ఉపాధ్యాయురాలికి డాక్టరేట్

పెదపాడు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అప్పనవీడు హైస్కూల్లో సంస్కృత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ముత్తింటి స్వాతికి తిరుపతి నేషనల్ సంస్కృత యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసినట్టు పాఠశాల హెచ్.ఎం. తోట పుష్పావతికి తెలిపారు. చితనామ్ సందేశ కావ్య సాహిత్యక మద్యమమ్ అనే అంశంపై నేషనల్ సంస్కృత యూనివర్సిటీ తిరుపతి ప్రొఫెసర్ జేబీ చక్రవర్తి పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేసిందన్నారు. డాక్టరేట్ పొందిన స్వాతిని పాఠశాలలో సోమవారం ప్రత్యేకంగా సన్మానించారు.

పవన్‌ను కలిసిన వెంకటలక్ష్మి



ఏలూరు రూరల్, సెప్టెంబర్ 1, (ఆంధ్రజ్యోతి) : ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను సోమవారం రాష్ట్ర వడ్డీ కార్పొరేషన్ చైర్మన్ ఘంటశాల వెంకటలక్ష్మీ మర్యాదపూర్వకంగా కలిశారు. వెంకటలక్ష్మీ ఇటీవల వడ్డీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా కొల్లేరులో ఉన్న వడ్డీల సంక్షేమానికి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.


రోడ్డు దాటుకుంటూ వెళ్తున్న కొండ చిలువ

భారీ కొండచిలువ హతం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల మార్కెట్ యార్డు సమీపంలో రహదారిని దాటుతున్న ఓ భారీ కొండచిలువను చూసి స్థానికులు, వాహనదారులు బీతిల్లారు. దాదాపు పది అడుగుల పైబడి ఉన్న ఆ కొండ చిలువను చూసి వాహనదారులు ఆందోళన చెందారు. కొందరు యువకులు సాహసించి కర్రలతో కొట్టి హతమార్చారు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

నేడు చెక్కపల్లిలో రక్తదాన శిబిరం

ముసునూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా చెక్కపల్లిలో ఏలూరు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మండల కో-ఆర్డినేటర్ తోట ప్రభాకర్ తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో మండల ప్రజలు, జనసైనికులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పారుశుధ్యం మెరుగుకు చర్యలు

ముసునూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారుశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో బీఏ సత్యనారాయణ అన్నారు. సోమవారం గుడిపాడు బీసీ కాలనీలో డ్రెయినేజీ పూడికతీత పనులను టీడీపీ నాయకులతో కలసి ఆయన ప్రారంభించారు. ఎక్స్‌కోవేటర్‌తో రహదారులకు ఇరువైపులా డ్రెయినేజీల్లోని సిల్ట్‌ను తొలగించారు. మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లో విడతలవారిగా డ్రైనేజీల పునరుద్ధరణ పనులను చేపట్టనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.


సెమినార్‌లో మాట్లాడుతున్న బీవీ రాఘవులు, హాజరైన ప్రముఖులు

సోషలిజమే ప్రత్యామ్నాయం

పెట్టుబడిదారీ విధానంతో సంక్షోభం : బీవీ రాఘవులు

భీమవరం టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అనేక దేశాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ విఫలమైందని, దేశానికి సోషలిజమే ప్రత్యామ్నాయమని సీపీఎం అగ్రనేత, పోలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. స్థానిక త్యాగరాజు భవనంలో సోషలిజం, విశిష్టత అంశంపై జిల్లా స్థాయి సెమినార్ సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాఘవులు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ విధానం ఉన్న సామ్రాజ్యవాద దేశాలు సంక్షోభంలో ఉన్నాయన్నారు. అదే సమయంలో సోషలిజానికి అనేక దేశాల్లో ఆదరణ పెరుగుతుందన్నారు. తిండి, ఇల్లు, విద్య, వైద్యం హక్కుగా మార్చి, సమాన వేతనం ఆలంబనగా అసమానత, కుల వ్యవస్థను రూపుమాపి సమానత్వాన్ని చూపించేదే సోషలిజం అన్నారు. కనీస అవసరాలు హక్కుగా ఉన్న సోషలిస్టు దేశాలు అభివృద్ధి దశలో ఉన్నాయని గుర్తుచేశారు. భారత రాజ్యాంగంలో సోషలిజం, లౌకికవాదం పదాలు తొలగించాలని ఆరెస్సెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారని, వారికి సోషలిజం, లౌకికవాద పదాలు అంటే ఎందుకు భయమని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్‌మీటర్ల పేరుతో ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల ప్రభావం పశ్చిమ గోదావరి జిల్లాపై ఎక్కువగా ఉందన్నారు. విద్యారంగంలో అశాస్త్రీయత పెంచేలా బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. చైనాలో సైన్స్‌తో అద్భుతాలు చేస్తున్నారని, మన దేశంలో ప్రజా ప్రతినిధులే మూఢ నమ్మకాలను చూపిస్తున్నారన్నారు. ప్రజా సమస్యలపై ఉద్యమ, పోరాటాలు మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సాంస్కృతికంగా మంచి సమాజాన్ని నిర్మించే లా సిపిఎం కృషి చేస్తుందన్నారు. అందుకు ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, మంతెన సీతారాం, చింతకాయల బాబురావు, బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, పీవీ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

3 రోజులు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాట్రాయి, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెంలో విద్యుత్ సరఫరా పనుల నిమిత్తం 2, 3, 4 తేదీలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ సంజయ్ తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఎరువుల విక్రయాలకు బయోమెట్రిక్ తప్పనిసరి

నూజివీడు టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా ఎరువుల క్రయవిక్రయాల్లో పారదర్శక విధానాన్ని అవలంబించా లని, నూజివీడు మండల వ్యవసాయశాఖ అధికారి పలగాని చెన్నారావు అన్నారు. నూజివీడు మండల వ్యవసాయశాఖ అధికారి కార్యాలయంలో మండ లంలోని ఎరువులు, పురుగుమందుల డీలర్లతో సమా వేశం నిర్వహించి మాట్లాడుతూ ఈ పాస్ ద్వారా బయోమెట్రిక్ విధానంలో ఎరువులు విక్రయించాలని, ప్రతి రైతుకు విధిగా బిల్లును అందించాలన్నారు. స్టాక్ బుక్, బిల్లు బుక్‌లను సక్రమంగా నిర్వహించాలని, నిర్ణీత ధరలకు మించి విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సులను రద్దుచేయటానికి కూడా వెనుకాడమని హెచ్చరించారు. మండల పరిధిలోని ఎరువులు, పురుగు మందుల డీలర్లు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు నీరందించడమే లక్ష్యం


నేలపాటికుంట వద్ద సాగర్ జలాలకు పూజలు

ముసునూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేంపాడు మేజర్ కాలువ చివరి ఆయకట్టుకు సాగర్ జలాలను అందించడమే లక్ష్యమని డీసీ చైర్మన్ రాపర్ల బాలకృష్ణ అన్నారు. ముసునూరు శివారు నేల పాటికుంట వద్ద ఎన్‌ఎస్పీ డీఈ విజయలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు, డీసీ చైర్మన్ తదితరులు సాగర్ జలాలకు ప్రత్యేక పూజలు చేసి, జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణలోని పాడేరు రిజర్వాయర్ వద్ద కాలువకు గండిపడి వేంపాడు మేజర్ కాలువకు నీటి ప్రవాహం ఆగిపోవడంతో మంత్రి పార్థసారథి ఆర్థిక సాయంతో కాలువ గండిని పూడ్చి కాలువకు నీటి ప్రహహాన్ని పునరుద్ధరించడం జరిగిందన్నారు. నాగార్జునసాగర్ ఎడవ కాలువ ద్వారా ఈ నెల 25వ తేదీ వరకు సాగర్ జలాలు వస్తాయని, మండలంలోని అన్ని చెరవులను నింపేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. టీడీపీ నాయకులు బొమ్మగంటి శ్యామలరావు, కొల్లి గంగారామ్, పొట్లూరి రామకృష్ణ, ఏఈలు రామదాసు, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కాళ్లతో కొత్త జీవితం

ఆగిరిపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు కృత్రిమ కాళ్ల అమర్చటం వల్ల కొత్త జీవితం ప్రారంభమవుతుందని హీల్ సీఈవో కూరపాటి అజయ్‌కుమార్ అన్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో సోమవారం గుంటూరుకు చెందిన చుండూరి కోటయ్య - రామశేషమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో ఏపీ, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన 14 మందికి 15 కృత్రిమ కాళ్ళను అందచేసినట్లు తెలిపారు. మండవ వెంకటేశ్వరరావు, త్రిపురనేని శ్రీనివాస్, హీల్ ప్రిన్సిపాల్ వై.లతా చౌదరి, సీనియర్ టెక్నీషియన్ కె.చిన్నా, కృత్రిమ అవయవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

శివనాగరాజు మృతి తీరనిలోటు

ఆగిరిపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీపీఎం మంచి క్రమశిక్షణ, అంకితభావం గల కామ్రేడ్‌ను కోల్పోవడం బాధాకరమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రవి అన్నారు. ఆగిరిపల్లి మండల పార్టీ కార్యదర్శి చాకిరి శివనాగరాజు అనారోగ్యంతో మరణించటం పార్టీకి, ఆయన కుటుంబానికి తీరనిలోటన్నారు. సోమవారం ఆయన సంస్మరణ సభ మండలంలోని నెక్కలం గొల్లగూడెం సుందరయ్యనగర్‌లోని ఆయన స్వగృహంలో నిర్వహించారు. రవి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ మండలంలో జరిగిన అనేక పోరాటాల్లో శివనాగరాజు క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. శివనాగరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు నరేష్, సర్పంచ్ రమేష్, ఎంపీటీసీలు గుర్రం శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ కాజా రాంబాబు, పాతూరు రవి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రాజు పాల్గొన్నారు.

సీఐటీయూ మండల కన్వీనర్‌గా రాంబాబు

చాట్రాయి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీఐటీయు చాట్రాయి మండల కన్వీనర్‌గా రాంబాబు ఎన్నికైనట్లు జిల్లా కార్యదర్శి రాజు ప్రకటించారు. చాట్రాయిలో సోమవారం జరిగిన సమావేశంలో ఎన్నిక నిర్వహించారు. ఏలూరు జిల్లా సీఐటీయు 13వ మహాసభలు సెప్టెంబరు 13, 14 తేదీలలో నూజివీడులో జరగనున్న నేపథ్యంలో సోమవారం చాట్రాయిలో జరిగిన సమావేశంలో రాజు మాట్లాడుతూ సీఐటీయు 1970లో ఏర్పడిన ప్పటి నుంచి ఉద్యోగులు, కార్మికుల ప్రయోజనాల కోసం పని చేస్తున్నదన్నారు. నూజివీడు సభలు విజయవంతం చెయ్యాలని కోరారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 126, 137
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	


నిరుపయోగంగా డివిజన్ అభివృద్ధి అధికారి కార్యాలయం

ప్రారంభం ఎప్పుడో? | నిరుపయోగంగా డీడీవో కార్యాలయం

(ఆంధ్రజ్యోతి - నూజివీడు టౌన్)

నూజివీడు డివిజన్ అభివృద్ధి అధికారి కార్యాలయం ప్రారంభం ఎప్పుడా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. నూజివీడు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో దాదాపు ఐదేళ్ల క్రితమే నిర్మాణం పూర్తిచేసుకున్న ఈ భవనం ఇటీవల దాదాపు రూ.10 లక్షలు ఖర్చుచేసి నవీకరించారు. భవనానికి రంగులువేసి చూడముచ్చటగా తీర్చిదిద్ది కార్యాలయ సైన్‌బోర్డులు సైతం ఏర్పాటుచేసి నెలలు గడుస్తున్నా ఈ భవనం ప్రారంభానికి నోచుకోకపోవడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు. లక్షలాది రూపాయలు ప్రజాధనం ఖర్చుచేసి భవనాలు నిర్మిస్తున్నా కార్యాలయాలు మాత్రం అద్దె భవనాల్లో లేదా? పరాయి పంచన నిర్వహిం చాల్సి వస్తోందని, సొంత భవనాలు ఏర్పడినా ఆ భవనాల్లోకి కార్యాలయాలు మార్చటానికి అధికారులు, ప్రజాప్రతినిధులు


అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ వినూత్న

38 అర్జీల స్వీకారం

నూజివీడు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలకు ఆయా శాఖల అధికారులు సత్వరం పరిష్కరించాలని నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న ఆదేశించారు. సోమవారం నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వ హించారు. వివిధ శాఖలకు సంబంధించి 38 అర్జీలు దాఖలైనట్టు ఆమె తెలిపారు. ఆయా శాఖలకు సంబంధిత అర్జీలను పంపటం జరిగిందని, నిర్ణీత సమయంలోపు వాటిని పరిష్కరించి అర్జీదారులకు తెలియచేయాలని ఆమె తెలిపారు.

హుండీల ఆదాయం లెక్కింపు

నూజివీడు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నూజివీడు గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ పరిధిలో గల ఆలయాల హుండీలను సోమవారం లెక్కించారు. గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈవో అలివేణిశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లెక్కింపులో మొత్తం రూ. 6,63,452లు ఆదాయంగా లభించినట్టు తెలిపారు. కోటమహిషాసుర మర్దిని ఆలయం హుండీ ఆదాయం రూ2,98,564లుగా రాగా, వేంకటాచలస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ2,53,133లు, దాసాంజనేయస్వామి ఆదాయం రూ.36,961లు, శివాలయం హుండీ ఆదాయం రూ.77,794లుగా లభించినట్లు ఆమె తెలిపారు.

అవగాహన పెంచే పాఠ్యపుస్తకాలు

ముదినేపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాఠ్య పుస్తకాలతోనే విద్యార్థుల్లో విద్యా సామర్థ్యం, అవగాహన పెరుగుతాయని ముదినేపల్లి ఎంఈవో-2 కె.నరేష్ కుమార్ తెలిపారు. మండలంలోని చిగురుకోట ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రశ్నలకు పాఠ్య పుస్తకాల్లో జవాబులు గుర్తించే ప్రక్రియలో విద్యార్థులకు పునశ్చరణ శక్తి పెరుగుతుందన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. హెచ్ఎం విజయ కుమారి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నూజివీడు టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడు. నూజివీడు పట్టణ సీఐ సత్యశ్రీనివాస్ వివరాలు ప్రకారం నూజివీడు పట్టణం భువనగిరి పేటకు చెందిన పరిమి రాజాబాబు (70) అనారోగ్యానికి గురికావడంతో స్థానికులు నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే తమ విచారణలో మృతునికి సమీప బంధువులు ఎవరూ లేరని తెలిసిందని, ప్రస్తుతం మృతదేహం విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో ఉందని సమీప బంధువులు ఎవరైనా ఉంటే నూజివీడు పట్టణ పోలీసులను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

కోడిపందేలపై దాడి 9 మంది అరెస్టు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కోడిపందేల శిబిరంపై దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నట్టు నూజివీడు రూరల్ ఎస్ఐ జ్యోతిబసు తెలిపారు. దేవరకొండలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో దాడి చేసి 9మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.21,200 నగదు, రెండు పుంజులను స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలను మారుమూల ప్రాంతాల్లో కూడా డ్రోన్ కెమెరా ద్వారా పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు.


నూజివీడులో కేక్‌ను కట్ చేస్తున్న నాయకులు

టీడీపీ సంబరాలు

నూజివీడు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబునాయుడు మొదటిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి సోమవారం నాటికి 30 ఏళ్ల పూర్తి అయిన నేపథ్యంలో నూజివీడు చిన్నగాంధీబొమ్మ సెంటర్లో టీడీపీ శ్రేణులు భారీ కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నూజివీడు పట్టణ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీష్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సామాన్య కుటుంబం నుంచి వచ్చి అసామాన్య నాయకుడిగా చంద్రబాబు ఎదిగారన్నా రు. గత 30 సంవత్సరాల్లో నాలుగు సార్లు ముఖ్య మంత్రిగా పనిచేసిన ఘనత ఆయనదన్నారు. టీడీపీ నాయకులు మాధవరావు, ఆది, ఇళయరాజా, సత్యనారాయణ, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

సూపర్-6 సూపర్ హిట్..

కైకలూరు: సూపర్-6 పథకాలు సూపర్‌హిట్ అయ్యాయని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. సోమవారం కైకలూరు వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణమండపంలో తొలిసారి సీఎంగా చంద్రబాబు బాధ్యతలు 30 ఏళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. 1995లో సీఎంగా బాధ్యతలు చేపట్టారని అప్పటి నుంచి ఆయన రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. డ్వాక్రా మహిళా సంఘాలను ఏర్పాటుచేసిన తొలి ముఖ్యమంత్రిగా పేరొందారన్నారు. బీసీలకు, మహిళలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించారని ఆయన విజనరీతోనే నేడు రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని కొనియాడారు. డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు, పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాధరాజు, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహక కార్యదర్శి పూల రామచంద్రరావు, తెలుగు మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎండీ జానీ, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కెకె బాబు, మైనార్టీ నాయకులు సయ్యద్ బాషీద్, ఎండీ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి పెద్దపీట: కామినేని


భుజబలపట్నంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్

కైకలూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం భుజబలపట్నంలో ఉపాధి నిధులతో నిర్మించిన 225 మీటర్ల సీసీ రోడ్డును ప్రారంభించారు. రహదారికి గ్రామస్థులు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అని నామకరణం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న నాలుగేళ్లలో గ్రామీణా ప్రాంతాల్లోని అన్ని రహదారులను సీసీ రోడ్లుగా మారు స్తామన్నారు. మాజీ జడ్పీటీసీ సీతారామరాజు, ఎంపీపీ కృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు త్రినాథ రాజు, డీసీ చైర్మన్ వాసురాజు పాల్గొన్నారు.

కలిదిండి: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం గోపాలపురం, వెంకటాపురం, అగ్రహారం, సానారుద్రవరం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడుతూ పెన్షన్లు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చిట్టూరి రవీంద్ర, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతకు ప్రభుత్వ ప్రోత్సాహం

ముదినేపల్లి: ప్రజల ఐక్యతకు దోహదం చేసే కార్యక్రమాలకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని ఎమ్మెల్యే కామినేని అన్నారు. ముదినేపల్లిలో చవితి ఉత్సవాల్లో సోమవారం ఆయన కూటమి నాయకులతో కలసి పాల్గొన్నారు. ఈ ఏడాది గణేష్ మంటపాలకు ప్రభుత్వం విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేయడం నిర్వాహకులకు ఆర్థిక వెసులు బాటు కల్పించిందన్నారు. గురజ గ్రామంలో టీడీపీ నాయకుడు వీరిశెట్టి కొండలరావు కుమార్తె మరణించడంతో కొండలరావును కామినేని ఓదార్చారు.


వడాలిలో దివ్యాంగుడికి పెన్షన్ పంపిణీ

పండుగలా పింఛన్ల పంపిణీ

కైకలూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అర్హులందరికీ అందిస్తామని టీడీపీ నియోజకవర్గ కోకన్వీనర్ బొమ్మనబోయిన విజయలక్ష్మి అన్నారు. సోమవారం కైకలూరు 115వ బూత్‌లో అధికారులతో కలిసి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెన్షన్ల తొలగింపులో వైసీపీ చేసే దుష్ప్రచారాలను నమ్మవద్దని, అర్హులకు పెన్షన్లు అందించడటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పోలవరపు లక్ష్మీరాణి, తెలుగుయువత రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పి. రాధాకృష్ణ, ఎండీ జానీ, సయ్యద్ బాషీద్, వీరాబత్తిన సుధా తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లి మండలంలో ఎన్టీఆర్ భద్రతా పెన్షన్ల పంపిణీ సోమవారం 92 శాతం పూర్తయింది. మండలంలో 8787 మంది పెన్షనర్లకు రూ.3.82 కోట్ల సొమ్ము పంపిణీ చేయాల్సి ఉండగా, తొలి రోజు 8084 మందికి రూ.3.52 కోట్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు. మండలంలో వడాలిలో నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఊటుకూరులో కూటమి నాయకులు పోసిన పాండురంగారావు, వీరంకి వెంకటేశ్వరరావు, సర్పంచ్ వరలక్ష్మి, అల్లూరులో తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, విశ్వనాద్రిపాలెంలో మండల టీడీపీ బీసీ సెల్ కార్యదర్శి వీరంకి చక్రపాణి పెన్షన్లు పంపిణీ చేశారు.

ముసునూరు: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకాన్ని కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తూ పేదల్లో ఆనందాన్ని నింపుతోందని టీడీపీ మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. సోమవారం గుడిపాడులో లబ్ధిదారులకు ఆయన పెన్షన్ నగదును అందజేశారు. తొలిరోజు 95 శాతం పెన్షన్ల పంపిణీ జరిగిందని ఎంపీడీవో బీఏ సత్యనారాయణ తెలిపారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు మందలపు ధర్మరాజు, సొసైటీ అధ్యక్షులు కొల్లి కృష్ణయ్య, నాయకులు కొల్లి గంగారామ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: అందరికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో భార్గవి అన్నారు. మండలంలోని మొత్తం 9623 మంది పింఛన్‌దారులు ఉండగా 426 మందికి నోటీసులు అందించినా ప్రభుత్వ ఆదేశాలతో వారికి కూడా పింఛన్ పంపిణీ చేసినట్లు తెలిపారు. సాయంత్రానికి 90 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. సర్పంచ్‌లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చాట్రాయి: కూటమి ప్రభుత్వం ప్రతి నెలా 1న పెన్షన్లు అందిస్తూ వృద్ధులు, వితంతువుల జీవితాల్లో వెలుగు నింపుతున్నదని టీడీపీ మండల ఎస్సీ సెల్ నాయకుడు నక్కా రాము అన్నారు. చనుబండ 6వ వార్డులో సోమవారం టీడీపీ నాయకులు పెన్షన్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు గుడిమళ్ళ బ్రహ్మయ్య, వీఆర్వో నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలో మొత్తం 8335 పెన్షన్లు ఉండగా సోమవారం సాయంత్రానికి 90.01 శాతం పెన్షన్లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

మండవల్లి: మండవల్లిలో సర్పంచ్ మెండా ఝాన్సీ సురేష్‌బాబు, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రాజేష్, సిబ్బంది 89 శాతం లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశారు. చావలిపాడులో యాదవ సాధికార సమితి రాష్ట్ర నాయకుడు తలారి రాజేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ తలారి వెంకటస్వామి పెన్షన్లు అందజేశారు.

ఉప్పుటేరు.. ప్రక్షాళన

(5వ పేజీ తరువాయి)

ఎక్స్‌కవేటర్లతో నీటి సంఘాల నాయకులు, డ్రెయినేజీ శాఖ అధికారుల పర్యవేక్షణతో తొలగింపు చర్యలను వేగవంతంగా నిర్వహిస్తున్నారు. వంతెన దిగువ భాగాన్న యాగన మిల్లి, గుడివాడలంక వంటి గ్రామాల్లో రహదారిలో ఏర్పాటుచేసిన తూములు చిన్నవిగా ఉండడంతో వాటిని తొలగించేందుకు ఆ ప్రాంత ఎమ్మెల్యే చింత మనేని ప్రభాకర్‌తో కలిసి కామినేని వాటిని పరిశీలించి పనులు చేపట్టేలా సూచనలు చేశారు. కాగా ఎగువ నుంచి వస్తున్న వరదనీరు ఎప్పటి కప్పుడు ఉప్పుటేరు ద్వారా సముద్రంలోనికి వెళ తుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మరలా కొల్లేరు, తమ్మిలేరు, రామిలేరు, బుడమేరు ప్రాంతా ల నుంచి భారీగా వరదనీరు కొల్లేరులోకి చేరుతోంది. ఈ పనులు నిర్వహించడం వల్ల ఎగువ నుంచి ఎన్ని వేల క్యూసెక్కుల నీరు కొల్లేరులోకి వచ్చినా ప్రవాహానికి అవరోధం లేకుండా ఉప్పుటేరు లోకి చేరుతుంది. పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆకివీడు మండలం అయిభీమవరం, చెరుకుమిల్లి, మండపాడు, కాళ్ళ మండలం ఏలూరుపాడు, తదితర గ్రామాల్లో డ్రెయినేజీశాఖ అధికారులు కిక్కిస, గుర్రపుడెక్కను నివారించేందుకు డ్రోన్లతో మందులను పిచికారీ చేయడంతో పాటు ఎక్కడికక్కడే ఎక్స్‌కవేటర్లతో ఉప్పుటేరులోని ఆక్రమణలను తొలగిస్తున్నారు.


ఉప్పుటేరు ప్రక్షాళన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కామినేని, కలెక్టర్ వెట్రిసెల్వి(ఫైల్)

మరో 50 మందికి..!

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం ఆదేశించిన విష యం విదితమే. ఇలా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రు ల్లో రీవెరిఫికేషన్ చేయించుకున్న వారికి రెండోసారి సదరం సర్టిఫికెట్లను కొత్తగా ప్రభుత్వం జారీచేసిం ది. అయితే రెండోదఫా జారీచేసిన సదరం సర్టిఫికె ట్లలోనూ పలు అవకతవకలు చోటు చేసుకున్నట్టు తాజాగా మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో జరిపిన నిర్ధా రణ పరీక్షల్లో డీఎస్సీ వైకల్య అభ్యర్థులు కొందరిని తిరస్కరించడమే దీనికి నిదర్శనమని ప్రచారం జరు గుతోంది. మరోవైపు వైకల్య శాతం ఎప్పుడూ ఒకేలా ఉండదని, హెచ్చుతగ్గులు సహజమని, తాజాగా కొందరు అభ్యర్థులను తిరస్కరించడం ఇదే కోవలోకి వస్తుందని తెలుస్తోంది. కాగా నలుగురు వీహెచ్ అభ్యర్థుల వైకల్య శాతాన్ని, సదరం సర్టిఫికెట్లను మెడికల్ బోర్డు తిరస్కరించినట్టు తమ వద్ద సమాచారం ఏదీ లేదని విద్యా శాఖ వర్గాలు వివరించాయి.




ఆటపాక, ముదినేపల్లిలో ఆకట్టుకుంటున్న గణనాథుల విగ్రహాలు



లడ్డూలను దక్కించుకున్న రాధాకృష్ణ, రాజేష్


కలిదిండిలో పల్లకిలో వినాయకుడి ఊరేగింపు

భక్తి శ్రద్ధలతో గణపతి నవరాత్రులు

▸ప్రసాదం లడ్డూకు పోటాపోటీ ▸ పలు రూపాల్లో ఆకట్టుకుంటున్న గణనాథులు

ముసునూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రుల అనంతరం స్వామివారి లడ్డూ వేలం పాటలు జోరందుకున్నాయి. మండలంలోని వెంకటాపురంలో గణనాథుడి చేతిలోని 6.5 కేజీల లడ్డూను రైతు సంఘం నాయకుడు కొసరాజు రాధాకృష్ణ రూ. 80 వేలకు వేలంలో దక్కిం చుకున్నారు. అలాగే గుడిపాడు బీసీ కాలనీలో స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని పాకిన నాగేశ్వరరావు రూ. 53 వేలుకు దక్కించుకున్నారు. సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు అన్నసమారాధన చేశారు. అనంతరం గణనాథులను వైభవంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. గ్రామ పెద్దలు ఎం.కృష్ణారావు, రాయంకుల లక్ష్మణరావు, సర్పంచ్ రాజబోయిన శ్రీదేవి శ్రీనివాసరావు, యువ కులు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: నూజివీడు మండలం జంగంగూడెం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన వేలంలో గణేష్ లడ్డూను రూ.31 వేలకు పాడి గ్రామస్థుడు వల్లభనేని రాజేష్ దక్కించుకున్నారు. మరో చిన్న లడ్డూలు రెండింటిని రూ.11,111లకు చిన్నారి ఏవాన్ష్ శ్రేష్ఠ దక్కించుకుంది. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించి, నిమజ్జన కార్యక్రమాలను ఉత్సవ కమిటీ నిర్వహించింది. గ్రామ ప్రముఖులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పొట్లూరి అశోక్, పొట్లూరి మధుబాబు, వల్లభనేని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: మండలంలో మట్టగుంట, కోరుకొల్లు, పడమటిపాలెం, కొండంగి గ్రామాల్లో సోమవారం గణేష్ నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. గణనాథులను ట్రాక్టర్లపై మేళతాళాలతో బాణాసంచా కాల్చుతూ ఊరేగించి కాల్వల్లో నిమజ్జనం చేశారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కలిదిండిలో పాతాళ భోగేశ్వరస్వామి ఆలయ రోడ్డులో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకుడి విగ్రహాన్ని సోమవారం భక్తులు పూల పల్లకిలో ఘనంగా ఊరేగించారు.

కైకలూరు: గ్రామాల్లో చవితి పండుగ సందర్భంగా ఏర్పాటుచేసిన గణనాథుని విగ్రమాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అటపాక మంచినీటి చెరువు గట్టుపై వరసిద్ధి వినాయకుడు పార్వతీపరమేశ్వర్లుతో దర్శనమిస్తున్నారు. అలాగే రోడ్‌సైడ్ రామాలయం వద్ద వినాయకుడు శ్రీవారితో దర్శన మిస్తున్నారు. భక్తులకు ఈ విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

ముదినేపల్లి: పలు మండపాల్లో వివిధ ఆకృతుల్లో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. శ్రీహరిపురంలోని రామాలయం వద్ద ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహం శిరస్సున గంగమ్మ, శివపార్వతులతో విశేషంగా ఆకట్టుకుంటోంది. గ్రామానికి చెందిన నీలం సుబ్బారావు దంపతులు ఆ విగ్రహాన్ని బహూకరించారు. అలాగే పలు మండపాల్లో ప్రముఖులు పూజలు చేస్తున్నారు. ఎస్ఐ వీరభద్రరావు పర్యవేక్షణలో వినాయక నిమజ్జనాలకు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

అవాంఛనీయ ఘటనలకు తావివ్వద్దు

ముసునూరు: అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా గణపతి ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. కాట్రేనిపాడు శివారు హరిశ్చంద్రపురం బొడ్డురాయి వద్ద ఏర్పాటు చేసిన గణేషుడిని ఆయన సోమవారం దర్శించుకుని పూజలు చేశారు. కమిటీ సభ్యులు, యాదవ సంఘం నాయకులు ఆయనను సత్కరించారు. టీడీపీ నాయకులు పిన్నిబోయిన మంగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: వెలమపేట యూత్ ఆధ్వర్యంలో చవితి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కోలాటం పలువురిని ఆకట్టుకుంది.